చిట్టికథ

# జీవితరేఖ

"ప్రేమ"

"రాధా...రాధా...రాధా..." ఎంతో ఆనందంతో ఇంట్లో అడుగు పెట్టిన గోపాలం, లోపల గదిలో వంటచేసుకొంటున్న భార్యని పిలిచాడు.

"ఒస్తున్నానండీ." అన్న రాధ సమాధానానికి తృప్తిపడని అతను, "త్వరగా రావాలి." అని తొందర చేశాడు.

"ఏమంత తొందర ?" అనడిగింది రాధ, రాకుండానే.

"రారాదూ, చెప్తాను." అన్నాడతను.

"ఇప్పుడొస్తే ఇక్కడ కూర మాడిపోతుందండీ."

"మరేం పర్వాలేదులే రద్దూ."

భర్తమాటల్లో సుస్పష్టమైన విసుగుని అతని ముఖంలో చూసినట్టు లేచివచ్చింది ఆమె.

రాధ తెచ్చిన మంచినీటిని అందుకొంటూ అన్నాడు గోపాలం—

"నీకోమంచి బహుమానం తెచ్చాను."

"ఏమిటో అది ?" అంది ఆమె అతని మొహంలోకి కొంటెగా చూస్తూ.

"చెప్పుకో చూద్దాం" అన్నాడతను, చెప్ప లేనట్టు చూస్తూ.

"చెప్పనా ?"

"ఊఁ! కాని మూడు ఛాన్సులలోగా చెప్పుకోవాలి సుమా !"

"అలాగే కానీ ముందా న్యూస్ పేపరు విప్పండి చెప్తాను."

న్యూస్ పేపరు చుట్టి ఉండి తన కివ్వబోయే ఆ బహుమానాన్ని చూపెడుతూ అన్న రాధ మాటలకి గోపాలం నవ్వుతూ అన్నాడు—

"గొప్ప తెలివేలే. న్యూస్ పేపరు విప్పితే నువ్వు చేప్పేదేమిటి ?"

"లేకపోతే నాకేమైనా దివ్యదృష్టి ఉందనుకున్నారా విప్పకుండా చెప్పటానికి !" అందామె నవ్వుతూ.

"ఊహించు చూద్దాం, నీ బుర్రెంత గొప్పదో."

ఆ మాట విని రాధ ఆలోచనలో పడ్డది. ఎంత సేపాలోచించినా ఆమెకా బహుమానమేదో తట్టనే లేదు. చివరకి ఇంట్లో మిరపకాయలు లేవనీ, సాయంత్రం ఆఫీసునుంచి ఇంటికి వచ్చేటప్పుడు పట్టుకు రమ్మనీ పొద్దున అతనితో చెప్పిన సంగతి స్ఫురణకురాగా అడిగింది ఆమె—

"మిరపకాయల పొట్లమా ?"

"ఛీ ఛీ. అప్పుడే ఒక 'ఛాన్సు' 'లూజ్' చేసుకున్నావ్. ఊరికే నోటికి వచ్చింది వాగకపోతే కాస్త ఆలోచించి చెప్ప రాదూ ?"

గోపాలం మాటలు విని వాడిపోయిన ముఖంతో రాధ మళ్లీ ఆలోచనలలోకి అడుగు పెట్టింది. తనకి చదువుకోటానికేదైనా పుస్తకం తెచ్చాడేమో ననుకుంది గాని మళ్ళీ తప్పితే తిడతాడేమో నని భయంవేసి చెప్పలేదు. అయినా అదంత బలంగా కనపల్లేదు ఆమెకి.

రాధ ఏమీ మాట్లాడక పోవటం చూసి గోపాలం ఎగతాళిగా అన్నాడు.

"ఏం ? చెప్పలేవా ?"

అది వినేసరికి రాధలో అభిమానం ముంచుకొచ్చింది, అందువల్ల "ఎందుకు చెప్పలేనూ ?" అంది రోషంతో.

"మరి త్వరగా చెప్పూ" అన్నాడతను.

రాధలో పట్టుదల పెరిగింది. ఏమైనా తనా బహుమానాన్ని కనిపెట్టి తీరాలన్న దృఢసంకల్పంతో మళ్లీ ఆలోచనలలోకి ప్రవేశించింది. ఇంట్లో లేని వస్తువు లన్నిటినీ ఆ పాకెట్టుతో పోల్చి చూసి పెదవి విరిచింది. కాలంగడుస్తున్న కొద్దీ తను చెప్ప లేకపోతున్నా నన్న భయమూ, అందువల్ల చిరాకూ అంకురిస్తున్నా యామెలో. అయినా ఎంతో ఓపికతో ఆలోచనలు సాగిస్తూనే ఉంది.

ఫలితంగా చివరకి అకస్మాత్తుగా తట్టిందామెకి. తాను కనుగొనగలిగానన్న సంతోషంతోనూ, అప్పుడే దాన్ని బయట పెట్టటం తన కేమాత్రం ఇష్టంలేకపోవటంతోనూ, భర్తని కాసేపు ఆడిద్దామన్న ఉద్దేశంతో అన్న దామె -

"తెలిసింది లెండి."

గోపాలం ఒక్కసారి ఉలిక్కిపడాడు. రాధ కనుక్కోగలిగిందా! అన్న ఆశ్చర్యం అతనిలో మూర్తీభవించింది. ఆమె మొహం కళకళలాడుతూ నిజంగా కనుక్కున్నదానల్లేనే కనపట్టంతో మరింత కుంగిపోయి అయినా తప్పదన్నట్టుగా అన్నాడు -

"తెలిస్తే ఏమిటో చెప్పూ?" అని.

"అదీ...అదీ..." అని ఆగిపోయింది రాధ.

"ఆగుతావేం, చెప్పూ." అన్నా డతనందుకొని.

"చెప్పనా...నిజంగా చెప్పనా......" అంటూ నవ్విందామె.

"అసలు నీకు తెలుసునా, తెలియదా. అది చెప్పు ముందు" అనుమానంగా అన్నాడతను. ఒక చెంప తనని ఏడిపిస్తోందని తెలియకపోలేదతనికి. అందువల్ల కాస్త కోపం కూడా కలిగింది గోపాలానికి.

"ఏం? ఎందుకు తెలియదు?" అంది రాధ కోపం నటిస్తూ.

సమస్త జనుల ఉత్సాహమునకు



ఆనందసుధ

15 దినములకు సరిపోవు

8 ఔ సీసా 1 కి రు 8 అ

శ్రీపాదకృష్ణమూర్తి శాస్త్రి & సన్సు
రాజమండ్రి

కుష్ఠు ★ బొల్లి

వగైరా మేహమచ్చలు, సెగ, సవాయి వ్యాధులకు, గ్యారంటి చికిత్స, క్యాటలాగు ఉచితం. జి వి. రెడ్డి అండ్ కో., (రిజిష్టరు) "భాస్కరాశ్రమము" గోపాలపురం, తూ. గోదావరి.

"తెలిస్తే చెప్పవేం, ఇందాకట్నించీ?" అన్నాడతను చిరాకుతో.

"అయితే చెప్తున్నాను, వినండి." అని "అదీ...అదీ..." అంటూ మళ్లీ ఆగిపోయింది రాధ.

"అదుగో మళ్లీ."

"అబ్బ. చెప్పనివ్వండి మీరు."

"త్వరగా చెప్పు మరి"

"అది...అదీ...పం..చ...దా...ర..." అంది చివరికి నవ్వుతూ చెప్పగలిగానన్న సంతోషంతో.

అతను ఒక్కసారి నోరు తెరిచి "షిదా నీకు తెలిసింది." అన్నాడు.

రాధ తప్పు చెప్పిందన్న సంతోషంతోనూ, ఇంతసేపట్నుంచీ తనని తిప్పలు పెట్టిందన్న కోపంతోనూ మాటలు పట్టిపట్టి పలుకుతూ "ఉత్త మట్టిబుర్ర." అన్నాడు మళ్ళీ.

రాధ ఆనందానికి ఆనకట్ట అడ్డుపడింది. భర్త మాటలు విన్న ఆమె నివ్వెరపోయి నుంచుంది. తను ఎంతో గొప్పగా కనిపెట్టగలిగాననుకున్న దాన్ని తన భర్త ఇంత తేలిగ్గా కొట్టివేశాడన్న సంగతి తెలుసుకున్న ఆమెలో ఉద్రేకం కట్టలు తెగి ప్రవహించింది. బుంగమూతితో అంది ఆమె -

"పోనీలెండి నాది మట్టిబుర్రే అయింది. మీది గట్టిబుర్రేగా. మీరే చెప్పుకోండి."

చివాలున లేచి వెళ్లిపోబోతున్న రాధ చీర చెరగు పట్టుకుని లాగుతూ అన్నాడు గోపాలం. అతనిలో సంతోషం మరింత ఉప్పొంగింది. ఆ బహుమానం పేరు చెప్పగానే ఆమె మొహం ఎంతో ఆనందంతో విప్పారుతుందనుకున్నాడు అతను. అందువల్ల ఆమెని మరింత ఏడిపించటానికి సిద్ధపడ్డాడు.

"ఇంకో ఛాన్సు ఉందిగా. అదికూడా కానీ."

"నాకేం అక్కర్లేదా ఛాన్సు. కావాలిస్తే మీరే చెప్పుకోండి. లేకపోతే ఊరుకోండి."

"అంత కోపమైతే ఎలా?" అన్నాడతను ఆమె చుబుకం ఎత్తి పట్టుకుని ఓదారుస్తూ.

"అబ్బబ్బ. ఏం చంపుతారండీ. అవతల కూరమాడిపోతోంది. త్వరగా చెప్పండీ ఆ బహుమానమేదోనూ." అందామె మొహంలోకి నవ్వు తెప్పించుకుంటూ.

"పోనీ దించిరా చెప్తాను." అన్నాడతను.

"మీరు చెప్పేస్తే నే వెళ్లి నాపనేదో చూసుకుంటాను."

"అలా వీల్లేదు. ముందది దించి వస్తే కాని చెప్పను."

రాధ గత్యంతరం లేక లోపలికి వెళ్లి కూరదించి మళ్ళా వచ్చింది.

"ఇంక చెప్పనా?" అనడిగాడతను, ఆమె రావటం చూసి.

"ఊఁ." అంది రాధ.

"అదీ... అదీ..."

"చెప్పండీ." అంది ఆమె దీర్ఘాలు తీస్తూ.

"చెప్పనా...నిజంగా చెప్పనా..." నవ్వుతూ అన్నాడతను

"అబ్బబ్బ. ఒద్దులెండి. చెప్పవద్దు." తనమాటలే తన కప్పచెప్పుతున్నాడన్న రోషంతో అంది రాధ.

"అయితే ఈసారి చెప్తాను విను. అదీ.. అదీ...పంచదార" అన్నాడు గోపాలం.

"ఏమీ కాదు." అంది రాధ దృఢస్వరంతో.

"పోనీలే ఆ మాత్రం బుర్రైనా ఉంది కదా. అయితే ఈసారి నిజం చెప్పనా?" అన్నాడతను.

"చెప్పండి." రాధ ఆశగా అతనివంక చూస్తూ అంది.

"చీర." నవ్వుతూ అన్నాడు అతను.

"చీరా!" అంది రాధ ఒక్కసారి ఉలిక్కిపడ్డట్టు.

"అవును. ఎందుకంత ఆశ్చర్యం?"

రాధ మొహం పాలిపోయింది. ఆమె మొహంలో నెత్తురుచుక్క లేదు. చీర పేరు చెప్పగానే ఆమె మొహం ఎంతో ఆనందంతో కళకళలాడుతుందనుకున్న గోపాలం ముడతలు పడ్డ ఆమె మొహం వంక ఆశ్చర్యంగా చూస్తూ అన్నాడు—

"అదేమిటి మొహం ముడుచుకుంటావెందుకు?"

అతనన్నదేమీ వినిపించుకోకుండా గంభీరంగా అడిగిందామె—

"ఎంత?"

"ముప్పయి రూపాయలు."

"మీ జీతమో?"

"డెబ్బయి అయిదు."

"ఇవ్వాళ తారీకెంత?"

"ఒకటి."

"ఇంటద్దె?"

మండిందతనికి.

"కోర్టులో క్రాస్ ఎగ్జామిన్ చేసినట్టు ఏమిటి ప్రశ్నలు. నే నిహ సమాధానాలు చెప్పను." అన్నాడతను కోపంగా.

రాధ అందుకుని అంది—

"పోనీ నే చెప్తాను వినండి. ఇంటద్దె ఇరవై. పాలూ, పెరుగూ పదిహేను. చీర ముప్పయి. మీ జీతం డెబ్బయి అయిదు. మిగిలేదిపది..."

గోపాలం—"అయితే...?" అన్నాడు విసుగ్గా.



రాధ వినిపించుకోకుండా ఆమె ధోరణిలో అంది—

"అప్పటికీ అంట్లు నేనే తోముకుంటున్నాను. గుడ్డలు ఉతుక్కుంటున్నాను. నీళ్లుతోడుకుంటున్నాను. పనిచేసేదాని చాకిరీ అంతా నేనే చేసుకుంటున్నాను. చాకలిదాన్ని కూడా..."

"అయితే ఏమంటావ్ ?" అన్నాడు గోపాలం కఠినంగా, మధ్యలో అందుకుని.

"పదిరూపాయలు ముప్ఫయిరోజులు రావంటాను."

"దానికి నేనేం చెయ్యను ?"

"ఈచీర తిరిగి ఇచ్చేసి రండి."

"ఏడిచినట్టుంది. అసలే ముక్కూమొహం తెలియనివాడు మళ్ళీ ఇదిస్తే ఎందుకు తీసుకుంటాడు ?"

"పోనీ ఇదిచ్చేసి ఇంతకంటె తక్కువలో—ఏపది పదిహేనురూపాయలకో - వచ్చే దేదైనా తీసుకురండి."

"ఇంతకంటె ఎక్కువ ఖరీదులో వచ్చే దేదైనా కొంటే ఇది తీసుకుంటాడుగానీ, ఇంతకంటె తక్కువ ఖరీదులో వచ్చేదికొంటే ఇదెందుకు తీసుకుంటాడు?"

"ఇలా తప్పుకోకపోతే మళ్లీవెళ్లి వాపసు చెయ్యటం నాకిష్టంలేదని చెప్పకూడదూ?" రాధ కోపంగా ఎత్తిపొడుస్తూ అంది. గోపాలం విసుక్కుంటూ—

"నా ఇష్టం. వాడి కొట్టుకి మళ్లీ నేను వెళ్లను. కట్టుకుంటే కట్టుకో. లేకపోతే తగలపెట్టుకో. నీ చీరల గొడవ వదిలించుకోవాలి." అన్నాడు.

"పాపం. అందుకే కాబోలు కొంపలో మూడు చీరెలు మూలుగుతున్నా ముప్ఫయి రూపాయలూ తగలేసి మరోటి తెచ్చింది."

"ఉన్నాయిలే మూడు చీరలు. ఒకటి వెలిసిపోయింది. ఒకటి చిరిగిపోయింది... చెప్పకోటాని కూడా సిగ్గచేటు." గోపాలం ఎగతాళిగా అన్నాడు.

రాధ బాధగా అంది—

"పోనీలెండి. లేనివాళ్లకి ఏవైతేయేం?"

"వెధవ గుడ్డలు వేసుకు తిరిగితే సంఘంలో మర్యాదగా ఉండొద్దూ?"

"అందుకని ముప్ఫయిలూ, నలభయిలూ తగలేసి గుడ్డలుకొని కూటికి లేకుండా బతుకుతామా ?"

"రెండురోజులు పస్తుపడుకుంటే ఏం? ఇంతలోకే చస్తామా?"

"ఎంతకాలమని ఇలా పస్తులు పడుకుంటాం?"

"అప్పు దొరికేటంత కాలమూ."

"కిందటినెలచివర ఆ శ్రీధర్రావు గారి దగ్గర తెచ్చిన బాకీ ఇంకా తీర్చనే లేదుగా. ఇదివరకల్లా ఏమీ తోచకపోతే వాళ్ల లక్ష్మితో కాసేపు కబుర్లు చెప్పతూ గడిపేదాన్ని. ఇప్పుడే మొహం పెట్టుకు వెళ్ళను, వాళ్ళ ఇంటికి ?"

"సరేగాని ఇహ ఇక్కడినుంచి దయ చెయ్యి. నేను రాసుకోవాలి. ఆఫీసువర్కు చచ్చేటంత ఉంది."

గోపాలం విసుగ్గా కసురుతూ అన్న ఈ మాటలకి రాధకి మండింది. కొంపకి రాగానే కాళ్లైనా కడుక్కోకుండా ఆ ఆఫీసు కాగితాలు ముందు వేసు కూర్చోకపోతే తనతో కాసేపు కబుర్లు చెప్పకూడదూ, ఆఫీసులో పొద్దుట్నుంచీ సాయంత్రం దాకా రాస్తూనే ఉంటాడు గద. మళ్ళీ రాత్రినుంచి తెల్లవారేదాకా ఏమిటీ రాత !

"రాత్రింబగళ్ళూ రాసే ఈవెధవ ఉద్యోగం వదిలేసి ఇంతకంటె మంచి ఉద్యోగం వెతుక్కోకూడదూ" రాధ విసుక్కుంటూ అన్నది.

గోపాలానికి కొంచెం కోపం వచ్చింది. తన ఉద్యోగాన్ని రాధ అవహేళన చేస్తోందనిపించిందతనికి. బి. ఎ. పాసయిన తనకి ఈ ఉద్యోగం దొరకటమే ఓ బ్రహ్మ ప్రయత్నం అయిందని ఆవిడకి మాత్రం తెలీదూ ? అన్న ప్రశ్న రావటంతో అతనిలో అంకురించిన కోపం అగ్నిలో పోసిన ఆజ్యం వంటిదైంది.

"మీ నాన్న చేస్తున్నాడులే ఇంతకంటె మహామంచి ఉద్యోగం." అన్నాడతను ఈసడింపుగా.

"ఏం? మా నాన్నకేం?" అన్న దామె సవాలు చేస్తూ.

"అబ్బే. మీ నాన్నకేం?" ఎగతాళిగా అన్నాడతను.

"హాయిగా కాలుమీద కాలు వేసుక్కూచుని మహారాజులా గడుపుతున్నాడు జీవితం." అన్నది తన తండ్రి కరణీకాన్ని ఒక్కసారి స్ఫురణకి తెచ్చుకుని, గర్వంగా.

"అవునవును." అన్నాడతను మరింత ఎక్కిరిస్తూ.

"మరింకేం?"

గోపాలం ఎగతాళి చేస్తున్నకొద్దీ రాధ రెచ్చిపోతోంది. ఆమె తనని ఎవరెన్ని మాటలన్నా పడుతుంది గాని తన పుట్టింటివారి ప్రసక్తి తెచ్చి వారిని అవమానించటానికి ప్రయత్నిస్తే భర్తయినా భరించలేదు. అటువంటప్పుడు తన తండ్రి కరణీకాన్ని తన భర్త ఇంతగా అవమానిస్తుంటే ఆమె విని ఊరుకోగలదా?

గోపాలం నుంచి ఏమీ సమాధానం రాకపోయేసరికి రాధే అంది మళ్ళీ—

"మా నాన్నకి ఆ ఊళ్లో ఎంత పేరుందో మీకేం తెలుసు. ఆయన పేరు చెబితే అంతా గడగడలాడాలిసిందే. మీరు మా నాన్న పేరు చెప్పకుని ఆయన అల్లుణ్ణని ఆ ఊళ్ళో ఏ గడప తొక్కినా మిమ్మల్నెంత ఆప్యాయంగా ఆదరిస్తారో తెలుసునా?"

ఇదేమీ వినిపించుకోనట్టు మొహం పెట్టి గోపాలం ఆఫీసు కాగితాల్లో మునిగిపోయి మౌనం వహించాడు. అతని మౌనం ఆమె

(37-వ పేజీ చూడండి)



# జీవితరేఖ

(22-వ పేజీ తరువాయి)

కోపాన్ని మరింత రెచ్చగొట్టింది. తను చెప్పేదంతా తనభర్త పెడచెవిన పెడుతూన్నాడని తెలుసుకున్న ఆమె కోపం ఆకాశాన్నంటింది.

"అక్కడ రైతులు ఒద్దంటున్నకొద్దీ కూరలతో సహా అన్నీ కొల్లలు కొల్లలుగా తెచ్చి పడవేస్తారు. ఈ కొంపలో కొండా మున్నా చిల్లుకానికికూడా కరువేనయ్యె ఖర్మ."

ఈసారి గోపాలానికి మండింది. ఆమె ముఖంవంక సీరియస్‌గా చూస్తూ, అన్నాడు—

"ఆ దోపిడీ కూడు తినకపోతేనేం ?"

"దోపిడీ కూడేమిటి?" అన్నదామె కనుబొమలు ముడివేసుకుని.

"అదే ఆ రైతుల చేవులు పిండి వసూలు చేసేది."

"చెవులుపిండేం వసూలు చెయ్యటం లేదు. వాళ్లు ఇష్టంకొద్దీ ఒద్దంటున్నా తెచ్చిపడేస్తే తీసుకోక తప్పుతుందామరి."

"పాపం, ఇష్టం కొద్దీ ఒద్దంటున్నా తెచ్చి పడవేస్తున్నారేం?" అన్నాడతను హేళనగా.

"లేకపోతే ?"

"లేకపోతే వాళ్లగుడిసె లక్కడుండగలదా - లేకపోయినా మళ్లా ఏడు వాళ్ళకా పొలం కౌలుకు దక్కుతుందా?- అయినా ఈరోజుల్లో ప్రతివాడు ఏదో పనిమీద పాకులాడేవాడే కానీ, నిజంగా వినయవిధేయతలుండి పూజించేవాడెవడు? ఇటువంటివాళ్ల కూడు తిని మీ నాన్న ఏం బావుకుని ఎంతకాలం బతుకుతాడులే."

రాధ మరింత మండిపడింది.

"మా నాన్న నెన్నెప్పుడూ పల్లెత్తు మాట అనెరగడు."

"పాపం. నేను రోజూ నిన్ను కొరుక్కుతింటున్నాను గదూ." ఈమాటలు విన్న రాధ ఉద్రేకానికి పట్టపగ్గాలు లేకపోయాయి. ఆమె ఉద్రేకంలో తన శరీరాన్నే మైమరచింది. కోపంతో పళ్లు బిగబట్టి నిప్పులు కక్కుతున్న కళ్లతో అరిచింది—

"మీ నాన్న రెవిన్యూ డిపార్టుమెంటులో పనిచేసి అంత లంచం తిని ఎంతకాలం బతికాడేమిటి. పోనీ మనకి చిల్లిగవ్వ మిగిల్చిందిలేదుగా. పైగా మా నాన్ననంటారెందుకూ ?"

"రాధా." అని గద్దించాడు గోపాలం కోపంతో.

"ఏమిటి ?" అంది రాధ.

"నోరుముయ్యి."

"ఎందుకు ముయ్యాలేం?" అగని ఆవేశంతోనూ, దుఃఖంతోనూ అంది ఆమె.

"ముందు నోరుమూసుకుని అవతలకి నడుస్తావా లేదా ?" మరింత కోపంతో కుర్చీలోంచి లేచి ముందుకొచ్చాడు గోపాలం.

రాధ ఇక మాట్లాడలేక వెక్కివెక్కి ఏడుస్తూ అక్కడినుంచి వెళ్లిపోయింది. గోపాలం మళ్ళా కుర్చీలో కూలబడ్డాడు. అతనికా కాగితాల మీదికి మళ్లీ మనసుపోలేదు. అతని ఆలోచనలు ఎంతసేపటికీ ఇందాక తను తెచ్చిన చీరమీదికే మళ్లుతున్నాయి.

నిజంగా తనమీద రాధకేమాత్రం ప్రేమ ఉన్నా ఆ చీరని ఆమె తిరస్కరించగలిగేదా? అన్న ప్రశ్నకి వచ్చే సమాధానం అతని హృదయంలో ఘాటుగా నాటుకొంది.

తనమీద ఆమెకేమీ ప్రేమ లేదని నిర్ధారించుకోటానికి నిదర్శనంగా కొన్ని సంఘటనలు అతనిలో సాక్షుల్లా ప్రత్యక్షమయ్యాయి.

ఒకరోజు ఆరు గంటలదాకా ఆఫీసులో చచ్చేటట్టు పనిచేసొచ్చి తలుపు తట్టాడు. కాని ఎంతసేపటికీ ఆ తలుపు తెరుచుకోబడలేదు. చివరికి విసుగ్గా కాలితో తంతూ, రాధా, రాధా అని కాస్త గట్టిగా పిలిచాడు. పిలిచిన అరగంటకి రాధ రుసరుసలాడుతూ వచ్చి "అబ్బ. ఏమిటండీ. అలా తలుపులు బద్దలగొడతారు. ఈ కొంపలో నాలుక్కాలాలపాటు పడుండాలని లేదా!" అంది. తనూ కాస్త కోపంతో "తమ సేవలు ఏలుతున్నారు." అనబోయాడు. దాని కామె మరింత రెచ్చిపోతూ "దొడ్లో పచ్చడి చేస్తున్నాను. అది అయ్యేదాకా ఆగకూడదూ. ఆ కాసేపూ ఆగుతే కాళ్ళేమైనా అరిగిపోతాయా" అంది. ఆరు గంటలదాకా ఆఫీసరు రుసరుసలకింద అణగి మణగి చచ్చి చచ్చి ఇంటికొస్తే గడపలో ఆనందంతో ఆహ్వానించకపోగా తలుపులకి గడియ బిగించుకుని దొడ్లో ఎక్కడో పచ్చడిచేస్తూ, పైగా ఏమైనా అంటే కోపమూ. తనకి మండింది. కాని ఎందుకు గోల అని ఆ రోజు సంభాషణ మార్చివేశాడు. అది ఇప్పుడు తలుచుకుంటే - తనకి రూఢిగా తెలుస్తూనే ఉంది తనమీద ఆమెకేమాత్రం ప్రేమ లేదని. ఇంకొక రోజు...

తన మరదలు ఏదో ఊరికి పోతూ దారిలో తమ ఇంట్లో ఒకరోజు ఉండి వెళ్లిపోబోతున్న సమయంలో ఆవిడ కొక్క జాకెట్టు గుడ్డయినా పెట్టకపోతే బాగుండదని తన భార్య అన్నప్పుడే తనదగ్గర గుడ్డిగవ్వ లేకపోయినా ఎరిగున్నవాడి గడపల్లా ఎక్కి దిగి చివరకి ఎక్కడా అప్పు దొరక్క ఇంటికొచ్చాడు. ఆ రోజు తనని రాధ ఎన్ని మాటలందో. ఎక్కడా అప్పు దొరక్కపోతే తనుమాత్రం ఏం చేస్తాడు.


గనోక్యూర్

అన్ని సెగలకు గంటలలో గుణము

ఈశ్వర ఫార్మశీ, రాజమండ్రి.



# గానకళా బోధిని

వెలువడినది ! అపూర్వ సంగీత గ్రంథము వెలువడినది !

By Mr & Mrs. N. C Parthasarathy

సంగీతమును ప్రారంభమునుండి రాగాలాపనలు, కల్పనస్వరముల వరకు నేర్చుకొను వారికిని, లోయర్, హైయ్యర్ గ్రేడ్ పరీక్షలకు పోవు విద్యార్థులకు శాస్త్రము, ప్రాక్టికల్ గ్రాఫులతోను పథకములతోను విపులముగా వ్రాయబడినది. $8\frac{1}{2} \times 5\frac{1}{2}$ (డెమ్మి 1/8) సైజులో 750 పేజీలు గల పుస్తకము. గ్లేజు కాగితముపై ముద్రింపబడిన పూర్తి క్యాలికో బైండు పుస్తకము వెల రు 10/-లు. పోస్టేజి ప్రత్యేకము. అడ్వాన్సుతోపాటు ఆర్డరు పంపేది.

బాలసరస్వతీ బుక్ డిపో, పి. బి. నెం. 3, కర్నూలు.

మరియు

వెంకటరాం అండ్ కో, పబ్లిషర్సు అండ్ బుక్ సెలర్సు,

అన్ని బ్రాంచీలలోను, హిగిన్ బాదమ్సు అన్నిస్టాల్సులోను దొరకును.

ఆ మర్నాడు తన మరదలు వెళ్లిపోయిం తర్వాత ఎవరో ఓ పది రూపాయలిస్తే భార్యయినా కుట్టించుకుంటుందని జాకెట్టు గుడ్డ తీసుకువచ్చినపుడు దానిని నేలకేసి విసిరికొట్టింది. ఆ గుడ్డ ఇప్పటికీ బీరువాలో పడి మూలుగుతూనే ఉంది.

మరో రోజు...అనవసరంగా ఇంకా పాతవన్నీ తవ్వుకుని బాధపడట మెందుకు! తనమీద అవిడకేమీ ప్రేమ లేదని స్పష్టంగా తెలిసిపోతుంటే.

పది రూపాయలు ముప్ఫయి రోజులు రావాలన్నమాటే రాధ హృదయంలో ప్రతిధ్వనిస్తోంది. నిజంగా ఎంత జాగ్రత్తగా వాడుకొన్నా మాత్రం పది రూపాయలు ముప్ఫయి రోజులు వస్తాయా! ఈ చీర తిరిగి ఇచ్చివేస్తే వచ్చే ఆ డబ్బుతో ఎలాగోలా నెల రోజులూ సరిపుచ్చుకోవచ్చు. ఈ మాటే తను తన భర్తతో చెబితే పెడ చెవిన పెడతాడేం? తనమీద ఎంతో ప్రేమ ఉండి తెచ్చినవాడు ఈ చీరని తిరిగి ఇచ్చేసి రమ్మంటే ఇచ్చిరాకూడదూ. తన కిష్టంలేని పనిని అత నెందుకు చెయ్యాలి. ఇదేనా తన భర్తకి తనమీద ఉన్న ప్రేమ.

ఒకసారి ఏదో విషయంలో తను "అది కాదండీ" అంటూ భర్తతో తన అభిప్రాయం చెప్పబోతుంటే మధ్యలో అందుకుని "చాల్లే ఇహ ఆపు. నీ బోడి సలహా లెవడికొకావాలి" అంటూ విసుక్కున్నాడు. అటువంటప్పుడు ఎవరికి కోపం రాదు. అయినా తను ఓర్పు వహించి ఊరుకున్నది కాని ఇంకొకతైతే ఆరోజు అలా ఊరుకోగలిగేదా?

మరోసారి తను ఇంటిపక్కావిడతో మాట్లాడుతూ ఉంటే అతను కాసేపు అటూ ఇటూ తచ్చాడి చివరికి ముఖం ముడుచుకుని ఏమీ పనిలేకపోయినా ఏదో పురమాయించాడు. తనతో మాట్లాడుతుంటే చిరాకు, పోనీ ఇతరులతో మాట్లాడుతుంటే ఆయన కంతకష్ట మెందుకో?

ఇవన్నీ నిజంగా ఆయనకి తనమీద ఏమీ గౌరవం లేదని తెలుపుతూనే ఉన్నాయి. తను ఇంకా ఇక్కడుండి మటుకు చేసేదేమిటి తనపుట్టింటి వారిదగ్గర ఓ పదిరోజులు గడిపి రావచ్చు."

"ఈపూట అన్నం పెట్టదల్చుకోలేదా?"

కాశ్మీర్
అన్నిదగ్గులకు అమోఘమైనది
గిరిజా & కో; రాజమండ్రి

విచారంగా కూచుని ఆలోచిస్తున్న రాధవంక ఉరుముతూ చూసి అప్పుడే వస్తూ అన్నాడు గోపాలం.

"ఎందుకు పెట్టను?" అంది రాధ.

"మరింకో ఆ ప్రయత్నాలేవీ చెయ్యవేం?"

"మీరప్పుడే లేవరనుకున్నాను."

"ఇప్పుడెంతయిందో తెలుసా?"

"తొమ్మిది."

"రోజూ తొమ్మిదింటికేనా తింటున్నది?"

"అంత ఆకలిగా ఉంటే మీ రడగకూడదూ?"

"ప్రతిరోజూ 'ఆకలిగా ఉంది, అన్నం పెట్టు' అని నే నడుగుతున్నానా, లేకపోతే 'వడ్డిస్తున్నాను లేవండి' అని నువ్వంటున్నావా?"

"పోనీ ఇప్పుడు పెడుతాను లేవండి." అంది రాధ కష్టంగా.

రాధ పీట వేసి కంచం పెట్టటానికి వంటింట్లోకి వెళ్లింది. గోపాలం కాళ్లు కడుక్కోటానికి స్నానాలగది వైపు వెళ్లాడు.

రాధ హృదయంలో ఏదో పెద్ద బండ పడ్డట్టుగా వుంది. ఆమె మనసు విరిగిపోయి విచారంగా ఉంది. ఒక పక్క కోపమూ మరో పక్క దుఃఖమూ – ఈ రెంటిలో ఆమె మునిగితేలుతోంది. గోపాలం పలుకులు ఆమె గుండెలో ములుకుల్లా గుచ్చుకున్నాయి.

"ఏమిటి ఇవ్వాళ అన్నంలోకి?"

అతని కంచంలో అన్నం వడ్డిస్తున్న రాధ వెనక గుమ్మందగ్గిర తువ్వాలుతో చేతులు తుడుచుకుంటూ అతను అడిగిన ప్రశ్నకి ఏవో ఆలోచనలలోనించి ఉలిక్కిపడి 'ఏమిటి' అన్నట్టు చూసింది.

"అన్నంలోకి ఆచింతపండు నీళ్లేనా లేకపోతే ఇంకా ఏమైనా ఉన్నాయా?" కాస్త కోపంగా అన్నాడు గోపాలం.

"చారూ, కూరా."

"అంతేగాని పచ్చడీ, గిచ్చడీ ఏమీ లేదన్నమాట."

రాధకి మండింది. ముప్ఫైలూ నలభయ్యిలూ పెట్టి చీరలు తెస్తూ ఇంట్లో అసలే చాలక చస్తుంటే పచ్చళ్లూ, పంచభక్ష్య పరమాన్నాలూ ఎక్కణ్ణుంచి వస్తాయి. అంతగా కావాలనుకున్నవాడు ముప్ఫయి రూపాయలూ తగలేసి చీర తీసుకురాకపోతే ఏ పది రూపాయలో పెట్టి ఓ వంద మామిడికాయలు తెచ్చిపారేస్తే సంవత్సరానికి సరిపోయే ఊరగాయి తినవచ్చును గా.

మళ్ళీ మాట్లాడితే ఏం తంటానో అని రాధ మెదలకండా ఊరుకుంది.

గోపాలం పీటమీద కూచుంటూ అడిగాడు.

"అదేమిటే?"

"ఏదీ?"

"అదే ఆ నల్లముద్ద."

"కూర."

"ఏమిటీ! అది కూరా!" ఎంతో వింతగా అడిగా డతను.

"అవును. ఏం?" అంది ఆశ్చర్యపోతూ ఆమె.

"ఊహు. ఏదో పురుగు వాలిం దనుకున్నానులే."

"ఇందాక మీతో మాట్లాడుతూంటే కాస్త మాడింది."

"అదసలు మింగుడు పడుతుందీ?"

"పోనీ పారేయండి."

అతను విసుక్కుంటూ అన్నాడు—

"హు. పారేద్దామన్నా అక్కడ తింటానికి మరే మున్నాయి."

రాధ కళ్లు చెమ్మగిల్లాయి. "చారు పొయ్యనా?" అంది మెల్లగా.

"పొయ్యి ఏం చేస్తాం - ఎలాగోలా కడుపు నింపుకోవద్దూ." చారు పోసింది. అతను ఒక ముద్ద నోట్లో పెట్టుకుని— "అబ్బబ్బా. కషాయం" అంటూ తుపుక్కున ఉమ్మేశాడు.

రాధ కళ్లనీళ్లు గిర్రున తిరిగాయి. పమిట చెంగుతో కళ్లు తుడుచుకుంటూ కష్టంగా అంది—

"నే నంటేనే ఇష్టంలేనప్పుడు ఇంక నేను చేసిన వంట ఏం బావుంటుందిలెండి."

ఈ మాటతో అతనికి మరింత విసుగూ, కోపమూ కలిగాయి.

"తొమ్మిది గంటల దాకా మాడినా, మాడిన కూర ఉడకని అన్నంతో నీ చేతి భోజనం తినేకంటే వేళ కింత పడేశే ఆ అయ్యరుగాడి అన్నం తినటం నయం."

అది వినేసరికి ఆమెలో ఉన్న ఉక్రోషం వృద్ధిపొందింది. పళ్లు కొరుకుతూ కోపంగా అంది—

"పోనీలెండి నే నంటే ఇష్టం లేనప్పుడు ఇంక నేనిక్కడ ఉండిమటుకు ప్రయోజనమేమిటి. రేపు పొద్దున్నే నేను మా ఊరికి వెళ్లిపోతాను."

అతనూ కోపంతో అన్నాడు—

"పోతేపో నువ్విక్కడ ఉండి ఉద్ధరించే దెవర్ని?"

"ఐతే రేపు రైలెక్కిస్తారు కదూ."

గోపాలం మాట్లాడలేదు.

* * * *

[ఇంకా వుంది]

పెద్దకథ

# జీవితరేఖ

"ప్రేమ"

(గత సంచికతరువాయి)

మర్నాడుపొద్దున ఆమెని 'లేడీస్ వెయిటింగ్ రూము"లో కూచో పెట్టి అతనుటికెట్ తీసుకురావటానికి వెళ్ళాడు. ఆ రాత్రి నించీ అప్పటిదాకా మళ్ళీవాళ్ళిద్దరూ మాట్లాడుకోనే లేదు. అసలా రాత్రి ఇద్దరికీ నిద్రపట్టనేలేదు. ఏవో ఆలోచనలతో గడిపేశారు. తెల్లవారి లేవగానే ఆమెగుడ్డలన్నీ సర్దుకుని ఓ ఇస్త్రీ చీరకట్టుకుని ప్రయాణానికి సిద్ధపడింది. అతనూ అది గమనించి మెదలకుండా ఓ 'జట్' తీసుకువచ్చాడు. బండీలోకూడా ఎడమొగం పెడమొగం పెట్టుకుని అతను బజారు వంకా, ఆమె జట్కాలో ఉన్న అద్దంలో తన ప్రతిబింబమూ చూస్తూ కూచున్నారు.

గోపాలం టికెట్ తీసుకున్నాడు. కొంతసేపు, ప్లాట్‌ఫారంమీద అటూ ఇటూ పచార్లు చేసి చివరికి 'హిగ్గిన్ బాదమ్స్'లో పుస్తకాలు చూస్తున్నాడు.

మరికొంతసేటికి రైలు వచ్చింది. అతను ఆదరాబాదరాగా ఆమెని ఓ కంపార్టుమెంటులోకి ఎక్కించి "టికెట్ ఇదిగో" అన్నాడు ముభావంగా. ఆమె మెదలకుండా చెయిచాచి తీసుకుని కిటికీ అద్దాలలో నించి బయటికి చూస్తోంది.

అతను మళ్ళీ ప్లాటుఫారంమీద పచార్లు చేయటం ప్రారంభించాడు. రైలుకదులుతుండగా ఆ కంపార్టుమెంటు దగ్గరకెళ్ళి "చేరగానే ఉత్తరంరాయి" అన్నాడు రాయక పోయినా ఏమీ పరవాలేదన్నట్టు. ఆమె ఏమీ మాట్లాడలేదు. రైలు కదిలి వెళ్ళిపోయింది.

గోపాలం మెల్లగా కాలినడకన ఇంటిదోవ పట్టాడు. దోవలో అతని కనేక ఆలోచనలు కలిగాయి. రాధ పుట్టింటికి పోవటం అతని కొక విధంగా ఆనందాన్నే కలుగజేసింది. కాని ఆ అనందంలో కూడా ఏదో కొంత వెలితి కనపడుతూనే ఉందతనికి.

మధ్యలో ఓ కాఫీహోటల్లోకి వెళ్ళి ఇడ్లీకి ఆర్డరిచ్చాడతను. ఇకమీదట తను ఎంత ఖర్చుచేసినా అడిగేవాళ్ళెవరూ లేరనుకోవటంలో అతని మనసుకి ఎంతో తృప్తిగా ఉంది. కాఫీకూడా తాగి పదిగంటలకి ఇంటికి చేరాడు.

ఇంటికొచ్చిన దగ్గరనుంచీ అతని కేమీ తోచటం లేదు. కాసేపు ఏదైనా నవల చదువుదామని తీశాడు కానీ రెండుపేజీలు కూడా చదవకముందే విసుగుపుట్టి దాన్ని పక్కనున్న బల్లమీదికి విసిరికొట్టాడు.

రాత్రల్లా నిద్రలేకపోవటంవల్ల కళ్ళు జ్యోతుల్లా వెలుగుతున్నాయి. ఒళ్ళు ఎంతో బద్ధకంగా ఉంది. కాసేపు ఓ చిన్న కునుకు తీద్దామని కళ్ళుమూసుకు ప్రయత్నించినా ఏవో ఆలోచనలతో నిద్ర పట్టనేలేదు. గోపాలం అలా పడుకోని ఉండగా ఇంతలో ఎవరో తలుపుతట్టారు.

"ఎవరూ?" అన్నాడు గోపాలం బద్ధకంగా.

"నేనేలే. తలుపుతియ్యి." బయటినుంచి సమాధానం వచ్చింది. గోపాలం లేచి వెళ్ళి తలుపుతీస్తూ అన్నాడు—

"రారా. రామ్మూర్తీ. ఈమధ్య కనపట్టం లేదేం?" రామమూర్తి లోపలికి ప్రవేశిస్తూ—

"ఈమధ్య ఓ చిన్న ప్రయాణం తగిలిందిలే" అని,

"అవునుగాని పదిగంటలదాకా నిద్రేమిట్రా. అదేమిట్రా. అదేమిటి కళ్ళలా ఉన్నాయేం? రాత్రి నాటకానిగ్గాని వెళ్ళ లేదు కదా." అన్నాడు.

గోపాలం నవ్వుతూ, "లేదులే రాత్రి సరిగా నిద్రపట్టలేదు." అన్నాడు.

రామమూర్తి గదంతా పరికిస్తూ టేబిల్ మీద ఉన్న నవలని చూసి దాన్ని చేతులోకి తీసుకుంటూ—

"కారణం. నవల పట్టేశావా ఏమిటి? అంత 'ఇంటరస్టింగ్'గా ఉందా ఏమిట్రా ఈ నవల. నాకూడా ఓసారివ్వు బాబూ చదివి మళ్ళీ ఇస్తాను. ఆదివారంకదూ ఏమీ తోచకుండా ఉంది. అందుకే కాసేపు కాలక్షేపం చేసొద్దామని ఇలా బైలుదేరి వచ్చాను." అన్నాడు.

గోపాలం వినలేక విసుగ్గా అన్నాడు—

"అబ్బబ్బ. అది కాదురా కారణం. అవతలవాణ్ణి నోరెత్తనీయకండా గుక్కతిప్పుకోకుండా మాట్లాడేస్తావేమిట్రా."

రామమూర్తి నవ్వుతూ, "లేకపోతే మరింకేమిటి కారణం?" అని కాస్త గట్టిగా "ఏమమ్మా రాధా. మీ ఆయన్ని బొత్తిగా నిద్రపోనియ్యటం లేదేమిటి రాత్రిళ్ళు?" అన్నాడు.

గోపాలం మొఖం ముడుచుకుని "అదింట్లో లేదు."

"ఏం? ఎక్కడికెళ్ళిం దేమిటి? పెత్తనాలకా?"

"కాదు. పుట్టింటికి."

రామమూర్తి కొస్త ఆశ్చర్యంగా "పుట్టిం



టికా!" అని, "ఈ ఆడవాళ్ళకి పుట్టిల్లు ఓ పెద్ద న్యూసెన్సు అయిపోయిందోయ్. చంపేస్తున్నారు మన్ని" అన్నాడు.

"ఏం? అలా అంటున్నావ్?"

"అబ్బే. ఏమీ లేదులే. కానీ, ఏదో కారణం చెబుతున్నట్టున్నావ్."

గోపాలం జరిగిందంతా సవిస్తరంగా చెప్పాడు.

రామమూర్తి అంతా విని నవ్వుతూ, "అదా సంగతి" అన్నాడు.


ఉమా బొత్తాములు

బంగారు రేకు కలియక లోహముపైన కవరింగుచేసి తయారుచేయబడినది. జీవిత కాల పర్యంతము తృప్తినిచ్చును.




కోరువారికి క్యాటలాగు ఉచితము.

ఉమాగోల్డు కవరింగ్ వర్క్సు,

ఉమామహల్ : మచిలీపట్టణము.

ఉమాగోల్డు కవరింగువర్క్సు పోస్టాఫీసు

టెలి : "ఉమా" మచిలీపట్టణము

Tele: 'U M A' Masulipatam.


గోపాలం ముసిముసిగా నవ్వాడు.

"కానీ నువ్వు చేసింది తప్పు పనేరా."

"ఏం? ఎంచేత?"

"అన్యాయంగా భార్యని పుట్టింటికి తరమటం తప్పు పని కాదూ?"

"అనుభవించనీ. నాలుగు రోజులా పుట్టింట్లో పడుంటే తెలిసొస్తుందులే." గోపాలం కోపంగా అన్నాడు.

రామమూర్తి నవ్వుతూ, "ఎవరికి తెలిసొచ్చేది? నీకా, ఆమెకా?" అన్నాడు.

గోపాలం మొహం గంభీరంగా పెట్టి, "నాకేం? హోటల్లో తింటాను" అన్నాడు.

"ఆవిడ మటుకు, నువ్వు హోటల్లో తింటే ఆవిడ ఇంట్లోనే తింటుంది."

"అహ ఎంతైనా మొగవాడు ఇంట్లో లేకపోవటం..."

"వాళ్ళ నాన్న లేడూ?"

గోపాలం నసుగుతూ అన్నాడు -

"మొగుడనే వాడు దగ్గర లేకపోతే..."

రామమూర్తి మధ్యలో అందుకుని -

"నీకు మాత్రం ఆవిడ లేకపోతే ఏం తోస్తుంది చెప్పు" అన్నాడు.

గోపాలం ఇక మాట్లాడలేదు.

అతనేమీ మాట్లాడకపోవటం గమనించి రామమూర్తే అన్నాడు -

"నీళ్ళలో నిటారుగా ఉన్న పుల్ల పెట్టినా, అది అడుగుభాగంలో వంకర తిరిగినట్టు మనకి కనిపిస్తుంది కదూ. అలాగే మన ముందు జీవితంలోకి తొంగిచూస్తే జవితరేఖ వంకరలు తిరిగి ఉన్నట్టు కనిపిస్తుంది తెలుసా. నీళ్ళలో పెట్టిన పుల్ల వంకరగా ఏవిధంగా లేదో అలాగే సరిగా జీవించడం నేర్చుకున్నవాడి జీవితరేఖ కూడా సాఫీగానే ఉంటుంది. వంకరగా ఉందని భ్రమించి భయపడ్డవాడి జీవితమంతా వంకరలతోనే తిరుగుతుంది."

గోపాలం ఏమీ మాట్లాడలేదు. రామమూర్తి చేతిగడియారం వంక చూసి అన్నాడు—

"పదకొండైంది. హోటలు కెళ్లొద్దామా?"

గోపాలం ఆశ్చర్యంగా అతనివంక చూస్తూ అన్నాడు—

"నీకూడా హోటలు తిండేం ఖర్మం?"

"ఏం? నేను హోటల్లో తినకూడదా?"

"అబ్బే అదికాదు. నీ పెళ్లామేమైంది?"

"ఆవిడ పుట్టింటిమీద బెంగపెట్టుకొని పయనం కట్టిందిలే." అన్నాడు రామమూర్తి నవ్వుతూ.

గోపాలం ఎంతో వింతగా చూస్తూ, "అయితే నువ్వు తరిమావన్నమాట." అన్నాడు.

రామమూర్తి మళ్లీ నవ్వుతూ, "నీ అల్లే రైలెక్కించి వచ్చా ననుకున్నావా ఏమిట్రా. రైలుదించి, రెండునాళ్లుండి మరీ వచ్చాను, తెలుసా?" అన్నాడు.

ఇద్దరూ కలిసి హోటలుకెళ్లారు.

ఆ రోజు సాయంత్రం దాకా వాళ్ళిద్దరూ ఎంతో ఆనందంగా చదరంగం మొదలైన ఆటలుఆడి, పాటలుపాడుతూ చివరికి చీకటిపడే సమయానికి సినిమాకి బైలుదేరి వెళ్లారు.

ఉత్తరం ముక్కయినా రాయకుండా, అకస్మాత్తుగా రైలుదిగి ఒంటరిగా ఇంటికి వచ్చిన కూతుర్ని చూసి రాధ తల్లిదండ్రులు అమితంగా ఆశ్చర్యపోయారు.

"ముక్కా నీపెట్టి ఓ కార్డు కొని రాసి పారేస్తే స్టేషన్కొచ్చే వాళ్ళంగా?" అన్నాడు తమ్ముడు.

"టైము లేకపోయిందిరా తమ్ముడూ." అంది రాధ ముసిముసిగా నవ్వుతూ.

"మీ ఆయనేడమ్మా?" అనడిగాడు తండ్రి.

"ఆఫీసులో పని ఎక్కువగా ఉందిట. రెండు మూడు రోజుల్లో ఏదో 'ఇన్స్పెక్షన్' కూడా ఉందిట. అందువల్ల రాత్రిళ్ళుకూడా ఆఫీసులో కూచునే పని చేసుకొంటున్నారు. మళ్లా ఓ వారం రోజుల్లో వచ్చి తీసుకువెడతా నన్నారు." అరగంటనుంచీ రైల్లో ఆలోచించుకున్న అబద్ధం ఆడేసింది రాధ.

"కులాసాగా ఉంటున్నావా? మొహం అంత వాడిపోయిందేమే?" అంది తల్లి, బహుశా రైలుప్రయాణంవల్ల కాబోలు ననుకుంటూ.

"పోవే, నీ మాటలకేం." అంటూ రాధ మేడమీదికి వెళ్ళిపోయింది.

ఆ సాయంత్రం రాధ వచ్చిందన్న వార్త తెలిసి చూసిపోదామని వచ్చింది జానకి. ఇద్దరూ పిట్టగోడమీద కూచుని కబుర్లు చెప్పుకుంటున్నారు. రివ్వన వీచేగాలికి వారి పమిటచెంగులు టపటప కొట్టుకొంటున్నాయి. మాటిమాటికీ మొహంమీద పడుతున్న ముంగురులను సద్దుకొంటూ ఏవో మాటలతో నవ్వుకొంటున్నారు వారిద్దరూ. ఆ మాటా ఈమాటా అడుగుతూ మధ్యలో జానకి అంది—

"మీవారికి వంట్లో కులాసాగా ఉంటోందిటే?"

(18-వ పేజీ చూడండి)

# జీవితరేఖ

(10-వ పేజీ తరువాయి)

"ఆఁ. ఉండకేం చేస్తుంది. రెండు పూటలా తింటూనే ఉన్నారుగా."

రాధ మొహం ముడుచుకుని జవాబిచ్చింది. ఆమె సమాధానం విని జానకి ఆశ్చర్యపోయింది. ఇంత నిర్లక్ష్యంగా ఆమె ఎప్పుడూ చెప్పనేలేదు. ఇదివరకెప్పుడైనా ఈ ప్రశ్న అడిగితే,

"అబ్బే నేనెంత చెప్పినా ఆయన వింటేనా? 'ఆరోగ్యం కాస్త సరిగా చూసుకోండీ' అని చెబితే 'ఇప్పుడు నా ఆరోగ్యానికేం లోటువచ్చిందితే' అంటారు." అని చెప్పేది. కాని ఈసారి ఈ ప్రశ్న వేసేసరికి ఎంతో నిర్లక్ష్యంగా సమధానం చెప్పింది. దాంతో జానకికి కాస్త అనుమానం కలిగింది. ఇంట్లో అతనితో పోట్లాడి రాలేగు కదా! అనుకుంది ఆమె. లేకపోతే ఎంత 'ఇన్‌స్పెక్టర్' ఉన్నా మాత్రం వారం రోజుల భాగ్యానికి పుట్టింటికి పంపిస్తాడా? అన్న ప్రశ్న ఆమెలో అంకురించటంతో ఆ అనుమానం మరింత దృఢపడింది. తేల్చుకుందామని అంది జానకి—

"అయితే మీ వారికి పని ఇప్పుడు ఎక్కువగా ఉందా?"

"పోనీలెద్దూ. ఆ గొడవ ఇప్పుడెందుకు. ఇంకా ఏవైనా విషయాలు మాట్లాడు." అంది రాధ విసుగ్గా ప్రసంగం మార్చుదామన్న ఉద్దేశంతో.

ఆమె ఈ విషయంలో విసుగుదల చూపిస్తున్నకొద్దీ జానకికి కుతూహలం పెరుగుతోంది. ఆమె ఎలాగైనా రాధకిచేత అసలు విషయం బయటపెట్టిద్దామని ప్రయత్నిస్తోంది.

"అది కాదు. మొన్నీ మధ్య మీ వారు మా ఆయనకి కనబడి ఓ నెలరోజుల దాకా ఎటువంటి తొందర పనులూ ఆఫీసులో లేవని చెప్పారట, అందుకని అడుగుతున్నాను."

రాధ ఇది విని తెల్లబోయింది. తను అనుకోని సంఘటన జరిగినందుకు ముందు ఆమె నోట మాట రాలేదు. జానకి తనని పరీక్షించటానికే ఇలా చెప్పిందని ఆమె గ్రహించక మెల్లగా అంది—

"ఏమో. నాతో మరి అలా చెప్పారు."

కాని ఈ మాటలు ఆమె నోరు దాటి వెళ్ళాయో, లేదో ఆమెకే తెలీదు. జానకి కాస్త పెద్దగా అంది.

"ఈ సంగతి నిజమేనా?"

రాధ మాట్లాడలేదు.

ఆమె మౌనానికి జానకి నవ్వుతూ "నిజంగా నువ్వు మీ ఆయనతో పోట్లాడి రాలేదూ?" అనడిగింది.

రాధ తల వాల్చుకుంది.

"ఏం?" అంది జానకి రెట్టిస్తూ.

రాధ ఆమెవంక దిగులుగా చూసింది.

"పరవాలేదులే రాధా. నాతో చెప్పు, అసలేం జరిగిందో." రాధకి ఇక చెప్పక తప్పలేదు. అంతా చెప్పి చివరకి,

"పోనీలే, మళ్ళీ ఓ వారం రోజుల్లో ఆయనేవచ్చి మహారాజులా తీసుకు వెడతారు." అంది అహంకారంతో.

"ఏం? ఎందుకు వస్తారు?" అంది జానకి.

"లేకపోతే ఆయన కా హోటలు తిండేం పడుతుంది?"

"మావారు లేరూ?"

"మీ ఆయనకంటే అలవాటు, ఎప్పుడూ 'క్యాంపు'లకి వెళ్తూ ఉంటారు కాబట్టి. కాని మా ఆయన ఎప్పుడైనా హోటల్లో తిన్నారు గనకనా పడటానికి."

"ఏమోలే. ఆయనా కోపంమీదనయినా రాకుండా ఉండవచ్చు."

"మా స్వాంగా" అంది రాధ పందెం వేస్తున్నట్టు.

* * *

పొద్దున్నే రామమూర్తి వచ్చి గోపాలాన్ని నిద్రనించి లేపాడు. ఇద్దరూ మొహాలు కడుక్కుని కాఫీ హోటలుకి దారితీశారు. మధ్యలో రామమూర్తి విచారంగా అన్నాడు—

"సారీ బ్రదర్. ఇవాళ అర్జంటుగా ఏదో 'క్యాంపు' కెళ్ళాలని ఆఫీసరు కబురు పంపించాడు. పొద్దున్నే ప్యూనువచ్చి నిద్రలేపి ప్రయాణానికి సిద్ధం కమ్మన్నాడు. నీతో చెప్పిపోదామని ఇలా వచ్చాను."

గోపాలం నిరుత్సాహంగా, "అలాగా అయితే మళ్ళీ ఎప్పుడు రావటం?" అనడిగాడు.

"బహుశా ఓ వారంరోజులు పట్టవచ్చు" అన్నాడు రామమూర్తి సందేహంగా.

"సరే పోయిరా. ఏంచేస్తాం." విచారంగా అన్నాడు గోపాలం.

ఇద్దరూ కాఫీతాగి సెలవు తీసుకుని చెరోదారి పట్టారు. గోపాలం బరువుగా అడుగులు వేసుకుంటూ ఇంటికి చేరాడు. అతనికి ఇంట్లో ఏమీ తోచలేదు. నిన్నంతా ఆటలతోనూ, పాటలతోనూ గడిపేశారు. కానీ ఇవ్వాళ రామమూర్తి లేడు. పదకొండింటికి ఆఫీసు ఉందిగాని అందాకా ఏం చేసేటట్టు?

గోపాలం నిన్న విసుగుపుట్టి అవతల పెట్టిన పుస్తకాన్నే గతిలేక మళ్ళీ బయటికి తీసి పఠించటం ప్రారంభించాడు.

ఎలాగోలా పదిన్నరదాకా ఆ పుస్తకంతోనే గడిపి హోటల్లో భోజనంచేసి అటునుంచి అటు ఆఫీసుకి వెళ్ళిపోదామని బైలుదేరాడతను.

హోటలుముందు 'మీల్స్ రెడీ' అన్న బోర్డు వేళ్ళాడుతూండటం చూసి లోపలికి వెళ్ళాడు గోపాలం.

ఓ కుర్చీలో కూలబడ్డ అతనికి కొంతసేపటికి సర్వరు విస్తరి తీసుకువచ్చి టేబిల్ మీద పెట్టబోయాడు. అంతకు పూర్వమే అక్కడ ఎవరో తిని వెళ్ళినట్టున్నారు. ఇంకా ఎంగిలి సరిగా పోనేలేదు. ఆ తుడిచిన మహానుభావు డెవరో గాని గోపాలం ఆ సర్వర్ని వారించి ఆ ఎంగిలి చూపించాడు.

"కడగకపోతే పీడాబోయిరి. ఆ ఎంగిలన్నా సరిగా తుడిపించు" అన్నాడతను చిరాకుగా.

"ఏమిటయ్యా వెధవ ఆచారాలు." అని సర్వరు విసుక్కుంటూ లోపలికి వెళ్ళి


## కార్‌బైడ్
# గాస్ లాంతర్లు
(కదపటి కన్వెషన్ గడువు)




కొత్త లాంతరు. ధరలు ఆఖరుసారి తగ్గింపబడినవి. 5 సంవత్సరములు గ్యారంటీ.

రిజిస్టర్డు డిజైను. ఇంగ్లీష్ బర్నరు. దేదీప్యమానమైన వెలుతురు నిచ్చును. వెంటనే ఆర్డరు యివ్వండి. ఇంత తక్కువ ఖరీదుకు ఇతరచోట్ల దొరకవు. వెల రు 18/- పోస్టేజివగైరా రుర/-లు మూడు వారాల తరువాత ఖరీదు రు 36/-లు అవుతుంది.

Midland Trading Co. Ltd.
P. Box No. 16605, Calcutta 4.

క్లీనరుని పిలుచుకువచ్చి టేబిల్ క్లీన్ చేయించాడు.

ఈ దృశ్యం చూసి పక్క టేబిల్ మీద అన్నం తింటున్న ఒకాయన నవ్వుతూ "అసలీహోటలు వాళ్ళకి శుభ్రత తెలియదండీ." అంటూ ఏదో చెప్పబోయాడు. అతను మాట్లాడుతున్నప్పుడు నములుతున్న మెతుకులు గోపాలం విస్తరిదాకా వచ్చి పడ్డాయి. గోపాలం విసుక్కుంటూ అతను చెప్పబోయే దాని కడ్డువచ్చి.

ముందు మీరు ఆమెతుకులు మింగి మాట్లాడండి." అన్నాడు కొంత కఠినంగా.

ఆ పెద్దమనిషి మొహం ముడుచుకొని "చాలేవయ్యా." అన్నాడు.

ఇంతలో సర్వరు అటు పోతూంటే గోపాలం అతన్ని పిలిచి "నెయ్యి తీసుకురా." అన్నాడు.

"అణా అవుతుంది ఎక్స్ట్రా."

గోపాలం చిరాకుగా, "సరే తీసుకురా." అన్నాడు.

ఎలాగో ఆపూట భోజనం కానిచ్చి గోపాలం సరాసరి ఆఫీసుకి వెళ్ళాడు.

ఆఫీసులో అయిదుగంటలదాకా గడిపి అటునుంచి అటు పార్కుకెళ్ళాడు, ఎవరైనా స్నేహితులు కనిపిస్తారేమో కాసేపు కులాసాగా గడపొచ్చు అనుకుని. కాని ఆనా డెవరూరాలేదు. అక్కడో గంటకూచుని చివరికి విసుగుపుట్టి ఇంటికి బయలుదేరాడు.

అరుగుమీద ఇంటిని కావలికాస్తూ శ్రీధరరావు కనిపించాడు. అతన్ని చూసి 'ఎందు కొచ్చినట్టు' అని ఆలోచిస్తూ సమీపించి "ఏమోయ్?" అని పలకరించాడు గోపాలం.

శ్రీధరరావు ఒక చిఱునవ్వు నవ్వాడు.

గోపాలం ఇంటికి తాళం తీసి లోపలి కనుగు పెడుతూ, "రా" అన్నాడు. శ్రీధరరావు అతన్ని అనుసరించి లోపల ప్రవేశించి ఓ కుర్చీలో కూర్చున్నాడు.

"ఏదో పనిమీద వచ్చినట్టున్నావ్?"

"అబ్బే. ఏమంత పెద్దపని కాదు" అని, "చూడు గోపాలం. ఆమధ్య నీకు కొంత చేబదులిచ్చాను చూశావూ. అది ఇప్పుడు కాస్త కావలసివచ్చిందోయి. నా దగ్గిర ప్రస్తుతం దమ్మిడీ కూడా లేదు. అవతల అప్పులవాళ్ళు వచ్చి నెత్తిమీద కూచున్నారు. లేకపోతే నిన్నసలు అడిగేవాణ్ణి కాదు మళ్ళా. నువ్వు తప్పక ఇస్తావని ఆశించివచ్చాను. మొన్ననే కదూ ఫస్టు తారీకు." అన్నాడు సిగ్గుపడుతున్నట్టు.

"అలాగా." అన్నాడు గోపాలం నీరసంగా. శ్రీధరరావుకి ఇవ్వవలసింది పాతిక రూపాయలు. అతనిదగ్గర ప్రస్తుతానికి ఉన్నవి పది రూపాయలు. ఈ పది రూపాయలే మళ్ళీ ఫస్టు తారీకు వచ్చేవరకు వాడుకోవాలి. నిన్ననే పాలూ, పెరుగూ వాళ్ళని పిలిచి వాళ్ళకి రావలసింది ముట్ట చెప్పాడు. ఇంటి యజమానిని పిలిచి అతనికివ్వవలసింది ఇచ్చేశాడు. ఇప్పుడు శ్రీధరరావుకి ఏం చెప్పాలో అతని కర్థం కాలేదు. కొంతసేపు ఆలోచించి, "అయితే రేపు పొద్దున తప్పకుండా ఇస్తానోయ్" అన్నాడు. ఆమాట అన్నాడే కాని అతనిలో ఒకవిధమైన నిరుత్సాహం ప్రబలింది. ఇవాళ్టి సాయంత్రం దాకా లేనిడబ్బు రేపు పొద్దుటికల్లా ఎక్కడనించి మొలుచుకొస్తుంది.

శ్రీధరరావు విచారంగా అడుగులు వేసుకుంటూ వెళ్ళిపోయాడు. గోపాలం చిరాకుగా తలపట్టుకుని మంచంమీద వాలాడు. రేపు పొద్దున శ్రీధరరావు కివ్వాలిసిన డబ్బు ఎలా ఇస్తాడో అతనికి అర్థం కావటం లేదు.

పాంటు విప్పేసి లుంగీకట్టుకుని హోటలు కెళ్దామని లుంగీకోసం బీరువా తెరిచాడతను.

లుంగీపక్కన మొన్న అతను తెచ్చిన చీర అతనివంక ఎగతాళిగా చూస్తూకనిపించింది. గోపాలానికి మండింది. తను ఎంతో ఆనందంతో తెచ్చిన చీరని మొత్తానికి తీసుకు వెళ్ళకుండానే వెళ్ళిపోయిందన్నమాట రాధ. ఇక తన జన్మలో రాధకి మళ్ళీ చీర తేకూడదనుకున్నాడు.

దాన్ని వాపసుచేసి ఆ డబ్బుతో శ్రీధరరావు బాకీ తీర్చేద్దామని బట్టలకొట్టుకి బయలుదేరాడతను.

షావుకారు ఒక పట్టాన ఒప్పుకోలేదు, ఆ చీర తిరిగి తీసుకోటానికి. కాని గోపాలం ఒదిలిపెట్టకుండా దెబ్బలాడి చివరకి ఓరూపాయి తగ్గించుకుని ఒదిలించుకున్నాడా చీరని.

డబ్బు తీసుకుని ఎకా ఎకీ హోటలు కొచ్చేశాడు గోపాలం. ఈసారి కావాలని కిందనే పెట్టించుకున్నాడు విస్తరి. నేల మీద చీమలు బారులు తీర్చి సైనికుల్లా నడుస్తున్నాయి. విస్తరి వేయగానే దాన్ని మూడువైపులనించీ చుట్టుముట్టాయిచీమలు. ఈగలు అన్నంపైన విమానాల్లా తిరుగుతున్నాయి. విస్తరిచుట్టూ అవు పోసనపట్టిన నీళ్ళలో యుద్ధనౌకల్లా ముందుకు చురుచుకొస్తున్నాయి కొన్ని పురుగులు. వీటన్నిటితో గోపాలం హోరాహోరిగా యుద్ధం ఆరంభించాడు. అతనికి ముద్ద మింగుడు పడటం లేదు.

చిటచిట లాడుతున్న అతని మొహం వంక చూస్తున్న కొద్దీ సర్వరుకి నవ్వు తోంది.

తింటూతింటూ ఉన్న గోపాలానికిఒక్కసారి దోడుకువచ్చినంత పర్యంతమైంది. అతనికి తలతిరుగుతున్నట్టనిపించింది. సర్వరు వంక క్రూరంగా చూస్తూ.

"ఏమిటిది?" అన్నాడు.

"ఏదీ?"




కేశవర్ధని అ. 14; షాంపూ అ. 14, అందరు డీలర్లవద్ద లభిస్తాయి.
లేక సౌత్ ఇండియా కెమికల్స్, క్రాస్ కట్ రోడ్, కోయంబుత్తూరుకు వ్రాయండి.

"ఇదుగో ఇదే కనపడటం లేదే?"

"బొగ్గుకాబోలు."

"ఏమిటీ!" అన్నాడు గోపాలం ఆశ్చర్యంగా. అతని కంఠకంఠకి కోపం ఎక్కువౌతోంది.

"బొగ్గుకదూ?" అడిగాడు సర్వరు. అది విన్న గోపాలానికి మొన్న తనభార్య కూర చేసిన ప్పుడు తనన్న మాటలు జ్ఞప్తికి వచ్చాయి. అప్పుడు అందులో పడ్డది పురుగుకాదని తెలిసికూడా తనన్న మాటలకి ఇప్పుడు కొంత చింతించాడతను.

"నీ కేమైనా కళ్లున్నాయా, ఊడాయా— చూడు సరిగా." గోపాలం మండిపడుతూ చేత్తో ఇంతలావు బొద్దంకిని చూపించాడు.

సర్వరు అతనివంక కోపంగా చూస్తూ—

"మాటలు సరిగా రానియ్యవయ్యా" అన్నాడు.

మాటలు సరిగా రానివ్వాలేం? నువ్వు పెట్టే అన్నం సరిగా ఉండక్కర్లా."

"నా ఇష్టంవచ్చిన అన్నం పెడతాను. ఇష్టమైతే తిను కష్టమైతే మాను. అంతే కాని ఇక్కడికొచ్చి మాటలంటే పడేవాడెవడూ లేడు."

"పాపం. అలాగేం?"

"లేకపోతే..."

"నోరు ముయ్యవోయ్."

# సీలు ఆన్సరు

**నిలువు:** 1. గువ్వ, 2. కేదారము, 3. సభ, 7. కోనకము, 8. కాముపాలుడు, 9. శేమధము, 10. శయనము, 12. శబలి, 13. పలము, 15. విధి. 16. గగనము, 17. నిజము, 18. అవ్వ, 19. నావ

**అడ్డము:** 1. గుహ్యకేశ్వరుడు, 3. గాసము, 5. దాహరి, 6. హారతి, 7. కరోటి, 8. కారెము, 11. మది, 12. శపథము, 14. బలము, 15. విహంగము, 17 నిధి, 20. అవ్వ, 21. జలము, 22. క్రముక.

పైన చూపించినది లక్ష్మీ క్రాస్‌వర్డ్సు No. 1 యొక్క సీలు ఆన్సరు. మీకు ప్రయిజు వచ్చినది అని నమ్మకముఉండి మీ పేరు ప్రయిజులిష్టులో లేనియెడల, ప్రయిజు లిష్టు ప్రచురించిన తేదీ మొదలు పదిరోజుల లోగా Scrutiny claim (స్క్రూటినీ క్లెయిమ్.) మాకు రిజిష్టరీ పోష్టుద్వారా పంపవలయును. (స్క్రూటినీఫీ క్రింద రు 2/- M. O. ద్వారా పంపిస్తూ M. O. రసీదును జతచేసి పంపవలయును. ప్రయిజులిష్టు 30-10-51 లోగా పంపబడును.

LAXMI CROSS WORDS

"ఇదుగో మళ్లీ చెబుతున్నాను మాటలు జాగ్రత్తగా..."

"రానివ్వకపోతే కొడతావా?"

"కొట్టక."

"అబ్బో నీబోటివాళ్లని సవా లక్షమందని చూశాను తెలుసునా?" గోపాలం నిర్లక్ష్యంగా ఎక్కిరిస్తూ అన్నాడు. దాంతో సర్వరుకి మండి, "ఏరా కొట్టిక" అంటూ చొక్కా చేతులు పైకి తీస్తూ సిద్ధమయ్యాడు. గోపాలం నెయ్యయినా కనుక్కోకుండా లేచి ఒక్క రంకె వేశాడు. నెయ్యి నెయ్యి కలిసే సమయానికి అయ్యరు ప్రభృతులంతా వచ్చి సద్దేశారిద్దరినీ.

* * * *

మర్నాటినుంచీ ఇంకొక హోటలులో తిందామనుకొన్నాడు గానీ ఊళ్ళోకల్లా మంచి హోట లన్న పేరుగన్న ఆ హోటలే అంత లక్షణంగా ఉంటే ఇంకా తతిమ్మా వాటి సంగతి చెప్పాలా అనుకున్నాడు గోపాలం ఆ రాత్రి.

అసలీ హోటళ్ళలో తినేకంటే ఓ "పాకబోధిని" పుస్తకం తెచ్చుకుని స్వయంపాకం ప్రారంభిస్తే బావుంటుందనిపించిందతనికి.

తెల్లవారి నిద్రలేవగానే బజారు కెళ్ళి, పుస్తకమూ, కావలసిన ఇతర వస్తువులూ తెచ్చుకున్నాడతను.

నాలుగు బొక్కెన్ల నీళ్ళు తోడగానే అలవాటు లేని అతని చేతులు కమిలిపోయాయి. అంతువల్ల పక్క ఇంటివాళ్ళ సహాయంతో ఓ పనిమనిషిని కుదుర్చుకున్నాడు.

లుంగీ కట్టుకుని, భుజంమీద ఓ తువ్వాలు వేసికుని తొమ్మిది గంటలకి పొయ్యిమీద పిల్లిని లేవదీశాడు అతను. ఒక పెద్ద గిన్నెలో ఓ తవ్వెడు బియ్యం పోసి దానికి నాలుగురెట్లు నీళ్ళుపోశాడు ఇంతకాలం నుంచీ ఎంత బియ్యం తనకి సరిపోతాయో తెలియని గోపాలం.

ఇంకో కుంపటినిండా బొగ్గులు పోసి వాటిని అరగంటసేపటికి అంటించి దాని మీద కూర వేయిద్దామన్న ఉద్దేశంతో ముక్కలు తరగటానికి కత్తిపీట తెచ్చుకున్నాడతను.

వేళ్లని ఆరుసార్లు కోసుకుని ఎలాగోలా ముక్కలు తరగటం పూర్తిచేసి కుంపటి మీది కెక్కించాడా కూరముక్కల్ని.

ఇంతలో బయట "లెటర్ సార్" అంటూ పోష్టుమన్ కేక వేశాడు.

రాధ దగ్గరనుంచి గావుల్ననుకున్న అతని మనసు ఆనందంతో ఊయల లూగింది.

త్వరలో వచ్చి తన్ని తీసుకువెళ్లమని రాసి ఉంటుందనుకొన్నాడతను. తనే స్వగా నన్న ఉత్సాహంతో పోష్టుమన్ నుంచి ఉత్తరం తీసుకున్నాడు. ముందు కింద సంతకం చూసి రాధేనని తెలుసుకున్న అతని కళ్ళు ఆనందంతో విప్పారాయి. ఎంతో వేగంతో చదివాడా ఉత్తరాన్ని అందులో ఇలా ఉంది—

ఈ ఊరుచేరాను. నన్ను మావాళ్లంతో ఆప్యాయంగా ఆదరిస్తున్నారు. ఇక్కడ నాకెంతో సుఖంగా ఉంది. పాపం మీ కక్కడ హోటలు తిండి సరిగా పడక చాలా ఇబ్బందిగా ఉందనుకుంటాను.

రాధ.

ఈ ఉత్తరం చదివిన గోపాలానికి ఒళ్లు పై తెలియనంత కోపం కలిగింది. అతను ఆశించింది అందులో ఏ మాత్రం లేనందుకు అతని కెంతో పశ్చాత్తాపం కలిగింది. ఆమె రాసిన "నన్ను మావాళ్లంతో ఆప్యాయంగా ఆదరిస్తున్నారు." అన్న ముక్క అతని హృదయాన్ని కలచి


# నపుంసకతైలం

అంగ, నరములు బలహీనతచెందిన చిన్నదైన, తిర్గి యథాప్రకారమై పూర్తి సౌఖ్య మనుభవింపుటకు 45 యేండ్ల ప్రఖ్యాతి చెందినది.

1 సీసా రూ. 10/ వి. పి. రూ 1-0-0.

డా॥ రత్నం సన్స్ మెడికల్ హాల్

మలకపేట బిల్డింగ్స్,

హైద్రాబాద్, దక్కన్.




సోల్ ఏజంట్లు యునైటెడ్ కన్‌సరన్, 14 ... వీధి, మద్రాస్, బెజవాడడిపో. సూర్యారావుపేట.

వేసింది. తనిక్కడ కొరుక్కు తిన్నాడని కాబోలు ఆమె అభిప్రాయ మనుకున్నాడు గోపాలం. "పాపం మీ కక్కడ హోటలు తిండి సరిగా పడక చాలా ఇబ్బందిగా ఉందనుకుంటాను." అని తన సానుభూతి తెలియజేసిన ఆమె ముక్కలు అతన్ని అమితంగా బాధించాయి. అంగువల్ల అతనిలో ఆమెమీద ఉన్న ద్వేషం మరింత వృద్ధిపొందింది.

అతనా ఉత్తరాన్ని ముక్కలు ముక్కలుగా చించి జాజ్వల్యమానంగా వెలుగుతున్న పొయ్యిలో పడేశాడు.

అకస్మాత్తుగా తలుపు తెరుచుకుని లోపల ప్రవేశించిన శ్రీధరరావు గోపాలం అవతారం చూసి ఆశ్చర్యపోయాడు.

ఇంతలో లోపల అన్నం పొంగిన శబ్దం విని శ్రీధరరావుతో కూర్చోమని చెప్పి లోపలికెళ్ళాడతను అన్నపు ఎసరు పొంగి పొయ్యంతా ఆరిపోతోంది. అతను ఆదరాబాదరాగా, ఉత్తచేత్తో మూతతీసి కింద పడేశాడు కాని అతని చెయ్యి దాని వేడికి అంటుకుపోయింది. బాధ భరించలేక 'అబ్బా' అని కేక వేశాడు గోపాలం

కేక విని ఆదుర్దాగా లోపలికి పరిగెత్తుకొచ్చిన శ్రీధరరావు ఈ దృశ్యం చూసి నవ్వాపుకోలేకపోయాడు. అతను నవ్వుతూ ప్రశ్నించాడు.

"ఏమోయ్. 'స్వయంపాకమా ఏమిటి ?"

ఈ ప్రశ్నకి గోపాలం ఎంతో సిగ్గుపడ్డాడు. అతను జాలిగా శ్రీధరరావు వంక చూస్తూ—

"అవునోయ్." అన్నాడు.

"ఏం ?" అన్నాడు శ్రీధరరావు.

"ఆవిడ పుట్టింటికి వెళ్ళింది."

"అలాగా - పోనీ హోటల్లో తినక పోయావు ?"

"ప్రయత్నించాను. కాని హోటలు మీల్సు నాకు పడలేదోయ్." అని లోపలికెళ్ళి అతని కివ్వవలసిన పాతిక రూపాయలూ తెచ్చి అతని చేతి కిస్తూ -

"చాలా ఆలస్యంగా ఇస్తున్నందుకు క్షమించు" అన్నాడు.

శ్రీధరరావు అందుకు సమాధానం చెబుతూ, "పరవాలేదులే ఏమంత ఆలస్యమయింది కనక. అయినా ఈ వగవడబ్బు కావలసివచ్చినప్పుడుండక అక్కర్లేనపుడు కొల్లలు కొల్లలుగా ఉంటుంది. అది సహజమేలే" అని. "ఒస్తానోయ్" అంటూ సెలవు తీసుకున్నాడు.

గోపాలం లోపలికి వెళ్ళి మాడిపోతున్న కూరని ఓసారి కలియబెట్టాడు.

ఇంతలో ఇస్త్రీ గుడ్డలు తెచ్చిన చాకలతను బయట గోలపెడుతున్నాడు. గోపాలం విసుక్కుంటూ బయటికి వచ్చి అందరూ ఇప్పుడే వస్తారు అనుకుంటూ "ఊరికే అరుస్తావెందుకూ?" అని కసురుకున్నాడు. అతనూ ఊరుకోక "అరగంట నుంచీ పిలుస్తుంటే, ఏమిటండీ" అన్నాడు కాస్త కోపంగా. "తెచ్చేది నాలుగు గుడ్డలూ, వేసేది నలభయి కేకలూనా" అని అలిసిపోయిన వాడల్లే గుడ్డలపద్దు చూసి అతన్ని పంపించేశాడు.

అప్పుడే పదకొండు గంటలైంది. ఇంత వరకు తను అన్నం తిన్నే లేదు. అక్కడ ఏమాత్రం ఆలస్యమయినా అధికారి అరుస్తాడు.

ఒకచోట గుజ్జుగుజ్జై మరోచోట బియ్యం బియ్యంగా ఉన్న అన్నం చూసేసరికి అతనికి మరింత చిరాకు పుట్టింది. దానికితోడు నల్లగా మాడిన కూర. పాపం రోజూ రాధ వీటితో అవస్థపడుతూ ఎలా ఉండేదో అనిపించిందతనికి. అనవసరంగా ఆనాడామెతో పోట్లాడి పుట్టింటికి పంపకుండా ఉంటే తనకీ నాడీ అవస్థ ఉండేది కాదుగదా, అనిపించిందతనికి. కాని వెంటనే ఆమె రాసిన ఉత్తరం స్ఫురణకి రావటంతో అతనికి ఆమెమీద కలిగిన దయ ద్వేషంగా మారింది. పోనీ తనే కోరి తెచ్చుకుని వెళ్ళిపోయిందిగా అనుభవించనీ అక్కడ. మరోవారం ఉంటే బాగా తెలిసవస్తుందిలే పుట్టిల్లంటే ఏమిటో అనుకున్నాడతను.

ఆ అన్నమూ, ఆ కూరా వేసుకు తిని అతను తీరిగ్గా పదకొండున్నరకి ఆఫీసుకి తరలి వెళ్ళాడు.

అరగంట ఆలస్యంగా వచ్చిన గోపాలాన్ని చూసి ఆఫీసరు ఉగ్రుడైపోయాడు.

"ఏం ? ఇంత ఆలస్యంగా వచ్చావ్ ?" అనడిగాడధికారి.

"లేటయిందండి." తల వొంచుకు సమాధానం చెప్పాడు గోపాలం.

"అదే నే నడిగేది. లేటెందుకయిందంట ?" మరింత మండిపడ్డాడు ఆఫీసర్.

గోపాలానికి కారణం చెప్పాలో తెలియలేదు. అందుచేత—

"రేపటినుంచి త్వరగా రావటానికి ప్రయత్నిస్తాను సర్." అన్నాడు.

(ఇంకా వుంది)


## ఆధునిక కామశాస్త్రము

స్త్రీ పురుషులకు సంబంధించిన అనేక రహస్య విషయములు, మన ప్రాచీన కామశాస్త్రములనుండియు, పాశ్చాత్యుల కామకళా గ్రంథములనుండియు సేకరించబడిన పలు సంగతులు నేటి తెనుగున విపులీకరింపబడినవి. నూతన దంపతులు చదివి అనుష్ఠింపవలసిన విషయము లనేకములు గలవు. వెల 2-0-0

## ఇంగ్లీషు విద్యాబోధిని

ఒకరి సహాయ మక్కర లేకయే ఆంగ్ల భాషను తేలికగ నేర్చుకొనుటకు వీలుగ వ్రాయబడినది. 30 దినములలో మంచి భాషాజ్ఞానమును నేర్పవచ్చును. వెల 1-0-0 ఖర్చు వేరు.

ఈశ్వర్ & కో

పోస్టుబాక్సు 139 - మద్రాసు

కాశ్మీర్

అన్నిదగ్గులకు అమోఘమైనది

గిరిజా & కో; రాజమండ్రి

## గాస్ లాంతర్లు



పూర్తిగా అమెరికాలో చేయబడినవి 400కాండిల్ సవరు సరికొత్త ప్యాకు. ధరలు విశేషంగా తగ్గింపబడినవి. వత్తులు, రెంచీలు, అన్ని పనిముట్లతో అమ్మబడును.

ప్రశస్తమైనది. పెద్ద సైజు 10 సం॥లు గ్యారంటీ. ఖరీదు రు 39/- ప్యాంగు పోస్టేజి రు.6/-లు అదనము 2 వారాల తరువాత ఖరీదు రు 72/-లు అగును.

STANDARD W. COMPANY.

Post Box 288, Calcutta 1

పెద్దకథ

# జీవితరేఖ

"ప్రేమ"

(గత సంచిక తరువాయి)

"పాపం ప్రయత్నిస్తావేం?" కళ్ళు చిట్లించి అన్నాడధికారి.

"లేదుసార్. రేపటినుంచి పెందరాళే వస్తాను."

"రేపటి సంగతి తరవాతాలోచిద్దాం. ముందివాళెందు కాలస్యమైందని అడుగుతున్నాను." అన్నాడాయన గద్దిస్తూ.

గోపాలం తల వంచుకుని కాలిబొటన వేలితో నేలని రాస్తూ చేతులు కట్టుకునుంచున్నాడు. కొంతసేపటికి మెల్లిగా అన్నాడతను.

"మిల్స్ తీసుకోటం కొంచె మాలస్యమయింది సార్..." అధికారి అతనివంక కాసేపు గుర్రుగా చూసి మళ్ళా తనపనిలో నిమగ్నుడయ్యాడు.

గోపాలం లోపలికి వెళ్లి తన సీటులో కూర్చుని పని చేసుకోటం ప్రారంభించాడు.

అతనికా రోజు పనిమీదికి మనసు పోటం లేదు. అతన్ని విసుగూ, విచారం ఆవరించాయి.

కాని ఆనాడే అతన్ని ఆఫీసరు అసలు ఆఫీసు వేళకంటె మరోగంట ఎక్కువ కూచోపెట్టి మరీ చేయించాడు పని.

"ఏమైనా ఇవ్వాళ నేను వెళ్లను." అన్నాడు రఘు చిందులు తొక్కుతూ.

"మా బాబువికదూ, ఇవ్వాళ ఒక్క రోజూ వెళ్ళు." అంది రాధ.

"ఏరోజు కారోజు ఇవాళ ఒక్క రోజునే అంటున్నావ్. అంత దూరం అనవసరంగా కాళ్ళు కొట్టుకుంటూ వెళ్ళటమే కాని ఒస్తుందా, పెడుతుందా?"

"ఇవాళ తప్పకుండా వస్తుందిగా."

"అలా నువ్వు ఏ రోజు అనలేదు కనక."

"నీకేమైనా కొనుక్కోటానికి అణా ఇస్తాను. ఇవ్వాళ ఒక్క రోజూ వెళ్ళి రావూ?" అంది రాధ బతిమాలుతూ.

"అణాకేమొస్తుంది?" అన్నాడతను మొఖం చిట్లించి.

"పోనీ బేడా ఇస్తాను. ఏం?"

"అయినా నాకు బోలెడంత 'హోం వర్కు' ఉంది. ఇప్పుడు పోస్టాఫీసుకెడితే ఆలెక్కలన్నీ ఎవడు చేస్తాడు." అన్నాడు రఘు ఏమైనా వీల్లేదన్నట్టు.

"మరో అణా ఎక్కువిచ్చి ఆ 'హోం వర్కు' కూడా నేనే చేసి పెడతాలే పోయిరా."

గోపాలం దగ్గిర్నుంచి ఏమైనా ఉత్తరం వస్తుందేమోనని రోజూ ఆమె అతన్ని ఈ విధంగానే బతిమాలుతూ పోస్టుకి పంపుతోంది. కాని ఇంతవరకు అతని దగ్గిర్నుంచి ఏ విధమైన ఉత్తరమూ రాలేదు. తను ఈ ఊరువచ్చి మూడు వారాలు తిరిగినా అతని దగ్గిర్నుంచి జాబురాకపోవటంవల్ల ఆమెకేదో భయంగా ఉంది.

ఇక్కడ పరిస్థితులు చూస్తే విషమిస్తున్నాయి. ఆమెకీ వాతావరణం ఏమాత్రం సరిపడటల్లేదు. ఇంటికొచ్చిన ప్రతివారూ తన వంక నఖశిఖపర్యంతం ఎగతాళిగా చూసి, 'ఇరవైరోజుల్నుంచి ఇక్కడే ఉంటున్నావా' అంటు న్నట్టనిపించిందామెకి.

అక్కడ తనా బాధలు భరించలేక ఏ రోజు కారోజు తనని రమ్మనో లేక అతనే వస్తున్నాననో రాస్తాడేమోనని ఎంతో ఆశగా ఎదురుచూస్తోందామె.

కొంత సేపటికి రఘు ఎంతో సంతోషంతో ఇంట్లో అడుగుపెడుతూ, "అక్కయ్యోయ్, బావదగ్గిర్నుంచిఉత్తరం వచ్చిందేవ్." అని కేకేశాడు.

ఆవార్త విన్న రాధకి గుండె కొట్టుకోటం ఒక్కసారి ఆగిపోయినట్టనిపించింది. ఆనందంతో ఆమె ఒళ్ళు పరవళ్ళు తొక్కింది.

"నిజంగా! ఏదీ, ఇలా తే"

ఇక ఇక్కడితో తన బాధలు గట్టెక్కయను కొందామె. మరి వారంరోజుల్నుంచీ ఆమె పేరు ఊళ్ళో ఎందరినోళ్ళ ధ్యానించారో ఒక్కసారి స్ఫురణకి తెచ్చుకునేటప్పటికి రాధ శరీరం గగుర్పొడిచింది.

మొదటివారం గడిచినప్పుడు, "అతనింకా రాలేదేమమ్మా? అని తన తల్లిదండ్రులు ప్రశ్నిస్తే వీళ్ళకేం సమాధానం చెప్పాలో తనకి తెలీలేదు. అప్పటికీ ఆలోచించి, "ఏదైనా కాంపు కెళ్ళారేమో" నంది. "పోనీ ఉత్తరమైనా రాయలేదేం?" అని మళ్ళీ వాళ్ళడిగినప్పుడు ఆమె గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్టయింది. అయినా కొంతసేపటికి—

"పనితొందరలో ఉండి రాసుండరు." అంటూ అక్కడినుంచి వెళ్ళిపోయింది.

అప్పటినుంచీ ఇప్పటివరకూ వారికి తన మొఖం చూపించటానికామెకి కాస్త బెరుగ్గానే ఉంది. అందువల్ల సాధ్యమైనంత వరకు వారికి కనబడకుండా తప్పుకు తిరుగుతోంది.

మొన్నీ మధ్య ఎవరింటికో పేరంటానికి వెళ్ళినప్పుడు ఆ ఇల్లాళ్ళంతా ఆమెవైపు ఎగాదిగా పరిశీలనగా చూసి గుస గుసలు ప్రారంభించారు.

"ఎవరమ్మా యీ అమ్మాయని" ఒకామె అడుగుతే "మన కరణం గారమ్మాయి కాదూ?" అని మరొకామె అన్నప్పుడు వేరొకామె తన ముఖానే అడిగింది—

"ఏమమ్మాయ్, నువ్వొచ్చి చాలాకాలమైనట్టుంది ఇంకా వెళ్ళలేదూ?"

ఆ ప్రశ్న విన్న రాధకి మహా మండింది. "నీకేమైనా కళ్ళున్నాయా, లేవా? లేకపోతే ఎదుట కనబడుతున్నా 'ఇంకా వెళ్ళ

సమస్త జనుల ఉత్సాహమునకు



లేదూ' అనడుగుతావేం?" అన్న మాటలు ఆమె నోటిచివరదాకా వచ్చాయి కాని బాగుండదని, "లేదండీ." అన్నదామె. అందుకామె ఎంతో విచారంగా, "అయ్యో ఎప్పుడో వెళ్ళిపోయా వనుకున్నానే, ఇంకా ఎంచేత వెళ్ళలేదమ్మా?" అంది.

అది విని రాధ బాధపడింది. 'తను రెండు రోజులు పుట్టింట్లోపడుంటే వీళ్లింత సహించలేరేం?' అనుకొందామె. అంతా 'ఎప్పుడు వెళ్లిపోతావ్?' అని ప్రశ్నించే వారేగాని 'హాయిగా మరో రెండు రోజులుండిపో,' అన్న వాళ్ళింతవరకు తను ఈ ఊరువచ్చిన మూడు వారాలలో ఒక్కరు కూడా కనిపించలేదే.

ఆఖరికి తమ పనిమనిషికూడా తనంటే చులకనే. జానకితో తనసంగతి చెబుతున్నప్పుడు విన్నదో ఏమోగాని మొన్నోసారి మొగుడితో ఎవరితో "చిన్నమ్మగారింకా నిద్రలేవలేదల్లే ఉందే" అన్నప్పుడు "ఆవిడకేమయ్యా మొగుణ్ణొదిలి పెట్టొచ్చిన ముండ." అంటూ ఏదో చెబుతోంది రహస్యంగా. తనప్పుడు నిద్రనుంచి లేచి కిందికి మెట్లుదిగి వస్తూ వింది మాటలు. అప్పటినుంచీ ఆమెకీ ఊరు వొదిలిపెట్టి ఎప్పుడు పోతానా అని పీకుతోంది మనసులో. ఈ భావాలన్నీ ఒక్క క్షణంలో స్ఫురణకొచ్చాయామెకి. ఇటువంటి వింకెన్ని జరిగాయో. జరుగుతాయో...

"అబ్బా అప్పుడే ఇస్తానేమిటే? ముందు నువ్విస్తానన్న మూడణాలూ, ఇవ్వాళ బావదగ్గిర్నుంచి నిజంగా ఉత్తరం వచ్చినందుకు మరో అణా కలిపి మొత్తం పావలా ఇస్తే అప్పుడిస్తాను." అన్నాడు రఘు నవ్వుతూ.

"అలాగే ఇస్తాలే ముందా ఉత్తరం ఇటివ్వు." అందామె.

"పాపం. ఎంతాశే. ఉత్తరం తీసుకుని పావలా ఎగ్గొడదామనుకున్నావు కదూ."

"కాదు. నిజంగా ఇస్తాను. ముందా ఉత్తరం ఇలా ఇవ్వు."

"అమ్మ. ముందు నువ్వే పావలా ఇవ్వు."

"అబ్బబ్బ. నన్ను వేధించకుండా త్వరగా ఇవ్వరా ఉత్తరం."

"అంత తొందరగా ఉంటే పావలా ఇచ్చేసి తీసుకో కూడదూ?"

రాధ ఇంక అతనితో మాట్లాడలేక తన పెట్టెలోనుంచి ఓ పావలా తీసి అతనికిచ్చి ఆ ఉత్తరం తీసుకొని త్వరత్వరగా పైకి వెళ్లిపోయింది.

"హోంవర్కు చేసిపెట్టావా?" అన్న రఘు మాటనికూడా వినిపించుకోలేదామె.

రాధ కవరు గబగబా చింపి ఉత్తరం చదువుకుంది. అందులో ఇలా ఉంది-

ఇక్కడ నాకు హాయిగా జరిగిపోతోంది. రామమూర్తి రోజూ వస్తున్నాడు. ఈ అన్నం నావంటికి బాగానే సరిపడుతోంది. 'నీ కక్కడ సుఖంగా ఉంటే ఉండిపో. గోపాలం తనీలైనూ

ఈ ఉత్తరం చదివిన రాధకి కోపమూ, దుఃఖమూ రెండూ సమపాళ్ళలో కలిగాయి. ఆమె ఇన్ని రోజులనుంచీ ఎదురు చూస్తున్న ముక్క అందులో ఒక్కటి కూడా లేదు.

నువ్విక్కడకి రాకపోతే వీల్లేదని రాయకపోయినా ఇక్కడికొస్తే బాగుంటుందని అతని ఉత్తరంలో రాసినట్టయితే ఆమె తక్షణం బయలుదేరి వెళ్ళేది. అందులో అదేమీ లేక నువ్వక్కడే ఉండిపో అని రాస్తే ఆమె ఏ మొహం పెట్టుకు వెడుతుంది?

అతనికి అన్నంకూడా బాగానే పడుతోందట. పైగా రామమూర్తికూడా రోజూ వస్తూఉంటే ఆయనకి కులాసాగా గడవక ఏంచేస్తుంది? రామమూర్తి ఓ తమాషా పురుషుడు. ఇతరుల్ని నవ్వించగలడు, ఏడ్పించగలడు. అనుకుందామె.

నిజంగా అక్కడతను పడుతున్న బాధలామెకేం తెలుసు?

అసలు తన ఉత్తరం చదువుకునే అతనలా రాశాడేమో ననిపించిందామెకి. తనలా రాయకపోతే అతనిలా రాసేవాడా అనుకుందామె. తనా ఉత్తరం ఆ ప్రకారం రాసినందుకెంతో విచారించింది.

చివరికామె, 'కానీ ఇలా ఎంత కాలం గడుస్తుందో' అనుకుంది.

ఇంతలో జానకి మెట్లెక్కి పైకొచ్చింది. వాడిపోయిన రాధ వదనం చూసి మళ్ళీ ఏదో జరిగిందనుకుందామె. రాధ జానకి వచ్చిన సంగతే ఎరగదు. ఆమె ఏదో తీవ్రంగా ఆలోచిస్తోంది.

జానకి మెల్లగా "రాధా!" అని పిలిచింది కాని ఆమె పలకలేదు. ఈసారి కాస్త గట్టిగా "రాధా, రాధా" అని పిలిచింది. అయినా ఆమె పలకలేదు.

జానకి మొదటిసారి పిలిచినప్పుడే రాధ ఆలోచనలలో నుంచి ఉలిక్కిపడింది. ఇంతలో రెండోసారి పిలిచేసరికి మైకం పూర్తిగా వొదిలి జరిగిన సంఘటన తెలుసుకుంది. అందువల్ల ఆమె తన మొహం చూపించటానికి కష్టపడక మెదలకుండా ఊరుకుంది.

తను రెండు సార్లు పిలిచినా రాధ పలకనందుకు జానకి కోపం నటించి అంది—

"ఇదే నా అమ్మ అతిథిని ఆదరించే విధానం." ఈసారికూడా రాధ పలుకలేదు.

"నీకంత ఇష్టం లేకపోతే వెళ్ళిపోతున్నా లేవే." అంది జానకి కాస్త తీవ్రంగా.

ఈ దెబ్బతో రాధకి జానకి నిజంగానే వెళ్ళిపోతుందేమో ననిపించి, "కూర్చో, జానకీ" అంది మెల్లగా.

జానకి అలసిపోయినట్టు "హమ్మయ్య, ఎంతసేపటికి" అని పక్కనున్న ఓకుర్చీలో కూర్చుంటూ, "అయితే ఏం జరిగిందీ, ఇలా ఉన్నావ్?" అని ప్రశ్నించింది.

రాధ ఏమీ మాట్లాడకుండా గోపాలం దగ్గిర్నుంచి వొచ్చిన ఉత్తరాన్ని ఆమె కందించింది.

జానకి అది చదువుకుని నవ్వుతూ "ఇంతే కదా," అంది.

జానకి ప్రవర్తన చూస్తున్న కొద్ది రాధకి మండుతోంది. తను ఇంతసేపట్నుంచీ ఈ ఉత్తరం చూసి బాధపడుతూంటే జానకి దాన్ని చూసి 'ఇంతేకదా' అని తేలిగ్గా కొట్టివేస్తుందేం! అనుకొందామె. తను ఈబాధని అనుభవిస్తే తెలిసివస్తుంది. అని కూడా అనుకుందామె. ఇంకొకరైతే ఈ పరిస్థితిలో తన్ని ఇలా అంటే చెడామడా తిట్టేది. తనతో చిన్నప్పట్నించిస్కూల్ ఫైనల్ దాకా చదువుకుని ఎంతో స్నేహపాత్రంగా ఉంటున్న జానకి నేమీ అనలేక పోయిందామె. అందువల్ల ఆ కోపాన్ని తన మొహంలోనే చూపెట్టిందామె.

రాధ ఈ భావాలు కనిపెట్టనట్టే జానకి తన ధోరణిలో నవ్వుతూ అంది.

"నేనిదివరకే చెప్పలా, 'ఆయనా కోపం మీద నయినా రాకుండా ఉండవచ్చు'నని. నువ్వప్పుడు, "చూద్దాంగా" అని పందెం వేశావ్. చూశావా, ఎవరు గెలిచారోను."

రాధ ఈ ధోరణిని సహించలేక

నమ్మకమైన నంజనగూడు ఔషధములు
కాశ్మీర్-కుసుం
కేశ వృద్ధికి
సాంటలక్స్
దురద తెగ గడ్డలు, కాటులు, మొటిమలకు
ప్రేమలీలా
ప్రసిద్ధమైన మైసూర్ ఊదువత్తులు.
నంజనగూడు పండ్లపొడి ఫ్యాక్టరీవారి ప్రసిద్ధ ఔషధములనే వాడుడు.
ది యునైటెడ్ కంపెనీ, 84, బందర్ వీధి, మద్రాసు.
బెజవాడ డిపో, సూర్యారావుపేట

పోతోంది. దెబ్బతగిలినచోటే మరో ఎదురు దెబ్బతగిలినట్టు అసలే గాయపడ్డ ఆమె హృదయం మీద మరో బాకుపోటుపొడిచి నట్టయింది జానకి ఈవాలకం రాధకి...

ఆమె ఇక భరించలేక తల పట్టుకొని గబగబా మెట్లుదిగి కిందికి దిగిపోయింది. జానకికూడా తనలో తను ముసిముసిగా నవ్వుకుని "బాగా పనిచేసింద"నుకొంటూ ఆమెని అనుసరించింది.

*    *    *

రామమూర్తి వంటగదిలోనుంచి ఇంట్లోకి ప్రవేశిస్తూ పిలిచాడు—

"రారా గోపాలం వంట పూర్తయింది. భోంచేద్దాం ?"

"నాకేమీ ఆకలిగా లేదురా రామ్మూర్తీ."

"ఏడిచావ్ లే ఈ మాటలు కట్టిపెట్టి అన్నానికి నడు. అయినా ఏమిట్రా నీకీ దిగులు. నీ కాకలిగా లేకపోయినా నేను కష్టపడి వండినందుకేనా తినవచ్చును గదుట్రా."

"నిజంగా ఏ మాత్రం ఆకలిగా లేదు భాయీ.

"నోరుముయ్యరా రెండు మెతుకులు మింగలేకపోతావా. లేలే. అసలు అన్నం ముందు కూచుంటే ఆకలిగా లేకపోయినా అదె ఎగిరిపోతుంది."

అంటూ రామ్మూర్తి గోపాలం రెక్కపట్టుకు లాక్కెళ్లాడు.

"అదేమిట్రా ఒక్క ముద్దయినా ముట్టుకున్నావ్ గావ్. లేకపోతే ఒకవేళ నాతో చెప్పకుండా మళ్లా పెళ్లాంవచ్చేంత పర్యంతం నిరాహారదీక్ష పూనావా ఏమిటి ?"

దీనికి గోపాలం సిగ్గుపడుతూ.

"అబ్బేలేదు" అన్నాడు.

"మరైతే ఎందుకు తినవ్ ? ఈ వియోగంతో ఇంత విరాగిగా మారిపోయావేమిట్రా ?"

"ఏమిటో అది పక్కనుండి పెట్టక పోతే ముద్ద మింగుడుపడటంలేదు. దాని చేత్తో చేసినవంట ఎంత బాగుండక పోయినా తినగలిగే వాడిని. కాని..."

"పాపం. నా చేత్తోచేసిన వంట ఎంత బాగున్నా తినబుద్ధి పుట్టటంలేదు కదూ ?" అన్నాడు రామమూర్తి నొచ్చుకున్నట్టు నటిస్తూ.

"అబ్బే, అదికాదు. నా ఉద్దేశంలో..."

"నాకు తెలుసులేరా నీ ఉద్దేశం."

గోపాలం స్నేహితుణ్ణి నొప్పిస్తున్నానే అన్న చింతతో తన హృదయానికి మరింత నొప్పిని కలుగచేసుకుంటున్నాడు. రామమూర్తి అది కనిపెట్టి అన్నాడు.

"నేనేదో నవ్వుతూ అన్నాను బ్రదర్. దానికేం బాధ పడకు. నా స్వభావం నీకు తెలియంది గనకనా" అని, "పోనీ ఇవ్వాళ ఆదివారమేగా ఆ ఊరువెళ్లి ఆవిడని తీసుకు రాకూడదూ ?" అన్నాడు.

"ఎప్పుడూ ?" అని ప్రశ్నించాడు గోపాలం కొంత ఆశగా చూస్తూ, అతని వంక.

"ఇవ్వాళ. పన్నెండున్నర కొక రైలుందిగా దాని కెళ్ళొచ్చు."

గోపాలం ఇంతలో ఏ మూహించాడో ఏమో, నిరుత్సాహంగా అన్నాడు—

"ఆఁ! ఎందుకులెద్దూ" అని.

"ఏం ? మీ మామగారేమైనా అంటారేమోనని సందేహిస్తున్నావ్ ? మరేం పర్వాలేదులే. ఆయనకిజవాబు నేచెప్తాగా. గుడ్డలు సర్దుకోనే కూడా ఇంటికి వెళ్లి గుడ్డలు తెచ్చుకుంటా" అని రామమూర్తి వెళ్లిపోయాడు.

గోపాలం కాసేపేదో ఆలోచించి చివరికి గుడ్డలుతీసి సంచీలో కుక్కుతున్నాడు. ఇంతలో రామ్మూర్తివచ్చి—

"ఏరా ఇప్పుడా గుడ్డలు లాండ్రీ కేద్దామనా ?" అనడిగాడు, గోపాలం అతని వంక ఆశ్చర్యంగా చూస్తూ.

"ఏ గుడ్డలు ?" అన్నాడు.

"అవే. ఇప్పుడు నువ్వా సంచీలో పెడుతున్నవి."

"అబ్బే లేదు. అవి ఇప్పుడు ఊరికి తీసుకు వెళ్ళేవే. ఏం ? మాసిపోయాయా ?"

"మాసిపోటం కాదు. అన్నిమడతలు మడిచావ్, అవి కట్టుకోటానికి పనికొస్తాయా అని."

గోపాలం చిఱునవ్వు నవ్వుతూ—

"ఏమిటో మన కేమన్నా అలవాటా, పాడా. ఎప్పుడన్నా ఏదైనా ఊరికి వెడితే రాధే సర్దేది." అన్నాడు.

రామమూర్తి చేతికున్న వాచీవంక చూస్తూ,

"సరేలే త్వరగా కానీ, పన్నెండు మ్పావయింది." అన్నాడు.

గోపాలం అతని వంక సాశ్చర్యంగా చూసి—

అప్పుడే పన్నెండుమ్ముప్పావా ? పన్నెండున్నరకేగా ట్రెయిను. ఇంకేమందుతుంది."అన్నాడు.

"పన్నెండున్నరంటే సరిగ్గా పన్నెండున్నరకే వస్తుందీ ? కనీసం రెండుగంటలన్నా లేటు. అందులో ఇటునుంచి వెళ్ళేదీ, అటునుంచి వచ్చేదీ రెండూ ఇక్కడే క్రాసింగ్. పోనీ మరో స్టేషనులో క్రాస్ అవుతాయా అంటే ఇటు పక్క నాలుగుస్టేషన్లూ అటు పక్క నాలుగుస్టేషన్లూ సింగిల్ లైనవేగా ?"

గోపాలం, "అవునే." అన్నాడు.

ఇద్దరూ బయలుదేరి స్టేషను చేరారు. రామమూర్తి చెప్పినట్టు ట్రెయిన్ సరిగ్గా గంటన్నర లేటు. వీళ్ళు వెళ్ళేటప్పటికి ఇంకా రైలురావటానికి అరగంట టైముంది.

ఆ అరగంటా ప్లాటుఫారం మీద అటూ ఇటూ తిరగటంతో గడిపారిద్దరూ.

ఇంతలో వీ ళ్లెక్కవలసిన రైలు కాకుండా అటునుంచి వచ్చే ట్రెయిన్ ప్లాట్ ఫారం మీదికి వచ్చి ఆగింది.

గోపాలం, రామమూర్తులు మనదేశపు ఆడవాళ్ళ ముఖా లెలా ఉంటాయో పరికిద్దామని లేడీస్ కంపార్టుమెంట్ వైపు నడిచారు.

నడుస్తూ నడుస్తూన్న గోపాలం ఆ కంపార్టుమెంటు గేటు దగ్గర రాధ దిగుతూండటం చూసి ఒక్కసారి ఆగిపోయాడు. అదే సమయంలో రాధ కూడా అతనివంక చూసి అలాగే ఆగిపోయింది. రాధ దిగకుండా ఆగి వింతగా చూస్తూండటం చూసి జానకి లోపలినుంచి తల బయటికి పెట్టి చూసింది. ఆమెకి రామమూర్తి, గోపాలంలు కనిపించారు. వెంటనే ఆమె రాధని దించి తను కూడా కిందికి దిగింది.

రాధా గోపాలంలు కలుసుకున్నారు. ఆమె లోపలినుంచి పైకుబికుబికి వచ్చే ఆనందాన్నీ, దుఃఖాన్నీ పట్టలేక, "ఏమండీ ?" అని అతని వక్షంమీద వాలిపోయింది. అతను పూడిపోయిన గొంతుతో నీళ్ళలోనుంచి మాట్లాడుతున్నట్టు "రాధా" అని ఆమెని హృదయానికి హత్తుకున్నాడు.

రామమూర్తి వాళ్లిద్దర్నీ బండిలో కెక్కించి "ఇంక మేం వెళ్తాంరా ?" అన్నాడు. గోపాలం నవ్వుతూ, "ఏడిచావ్ లే" అని "అరవకుండా ఎక్కండి." అంటంతో రామమూర్తి జానకిలు కిమ్మనకుండా ఎక్కారందులో. ★


# నారసింహ లేహ్యము



బంగారు చేర్చబడినది. మేహము, నిక్కాక, నిస్సత్తువ శుక్లనష్టమును హరించి బలమును, కాంతిని, వీర్యవృద్ధిని కలిగించు వరప్రసాదము—

20 తు॥ డబ్బి రు. 3-4-0 పోస్టేజి 10 అ.

పి. సి. ఏ. & కంపెని. "ఆయుర్వేదసమాజం" పెరిదేపి- నెల్లూరు జిల్లా: